


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 21 సెప్టెంబరు 2021 | సంపుటి : 03 | సంచిక : 43 | పేజీలు : 4 | వెల : రూ


# ఆన్‌లైన్ టికెట్ విధానంపై మంత్రి పేర్ని నాని సమీక్ష



విజయవాడ: ఆన్‌లైన్ పద్ధతిలో సినిమా టికెట్లు అమ్మాలనే ప్రక్రియ 2002 నుంచి ఉందని సమాచారశాఖ మంత్రి పేర్నినాని అన్నారు. ఇందులో భాగంగా సినీ పరిశ్రమకు చెందిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల్ని ప్రభుత్వం నేడు చర్చకు పిలిచిందన్నారు. ఆన్‌లైన్? టికెట్ విధానంపై విజయవాడలో మంత్రి పేర్ని నాని సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సినీ నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ల యజమానులతోపాటు దిల్ రాజు, డీఎన్‌వీ ప్రసాద్, ఆది శేషగిరి రావు, డీవీవీ దానయ్య హాజరయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థ, కరోనా వలన సిని పరిశ్రమ ఎదుర్కొన్న ఇబ్బందులను గురించి చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలుగు సినిమా పరిశ్రమకు సంబంధించి ఎగ్జిబిటర్ల సమస్యలు, నిర్మాతల సమస్యలు అన్నింటిని ప్రభుత్వం తరపున తాము నమోదు చేసుకున్నామని తెలిపారు. త్వరలోనే సినీ పరిశ్రమ సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించిన తర్వాత పరిష్కారం తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థ కు సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రతినిధులు సానుకూలంగా ఉన్నారని, మళ్ళీ ఇంకోసారి సినిమా ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు సమావేశం అవుదామని తెలిపినట్లు పేర్కొన్నారు. సీఎం జగన్ ఎప్పుడు కూడా సాధారణ ప్రేక్షకులకు వినోదం అందుబాటులో ఉంచేలా చేస్తారని వెల్లడించారు.

# ఎన్నికల ఫలితాలు బాధ్యతను పెంచాయి : జగన్



విజయవాడ, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించిన సందర్భంగా సీఎం వైఎస్ జగన్ సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. ప్రజలందరి చల్లని దీవెనలతో పరిషత్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించామన్నారు. ఈ విజయం తనపైనా, ప్రభుత్వంపైనా మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ వైసీపీకి ప్రజలు పట్టం కడుతూ వస్తున్నారని అన్నారు. ఈ రెండున్నరేళ్ల పాలనలో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ దాదాపు అమలు చేశామన్నారు సీఎం జగన్.ప్రజలందరి చల్లని దీవెనలతో పరిషత్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించగలిగామన్నారు సీఎం. ఈ ఫలితాలు ప్రతి కుటుంబం, ప్రతి మనిషి పట్ల తన బాధ్యతను మరింత పెంచాయని తెలిపారు. ఇప్పటికే 81 శాతం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను ప్రజలు ఎన్నుకున్నారని, మున్సిపల్ ఎన్నికల్లోనూ 99 శాతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలిచారని తెలిపారు. 86 శాతం ఎంపీటీలు, 98 శాతం జడ్పీటీసీ స్థానాల్లో గెలిపించారని సీఎం జగన్ తెలిపారు. ప్రతి ఎన్నికల్లో సడలని ఆప్యాయతను ప్రజలు అందిస్తున్నారని చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని తెలిపారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని కొన్ని శక్తులు ప్రయత్నించాయన్నారు. ఇదిలావుంటే 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలు విజయం సాధించారు. గతేడాది ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో 13వేలకు పైచిలుకు పంచాయతీలకు గానూ 10,536 పంచాయతీల్లో వైసీపీ మద్దతుదారులను గెలుపొందారు. మున్సిపల్ ఎన్నికల్లో 75 మున్సిపాలిటీల్లో 74 చోట్ల వైసీపీ విజయం సాధించింది. అలాగే 12 కార్పొరేషన్లలోనూ వైసీపీ విజయఢంకా మోగించింది. జడ్పీటీసీ, ఎంపీటి ఎన్నికల ఫలితాల్లోనూ వైఎస్ఆర్సీపీ ఘన విజయం సాధించింది. 9,583 ఎంపీటీసీలకుగానూ.. 8,249 ఎంపీటీసులు కైవసం చేసుకుంది. 638 జడ్పీటీసీలకు 628 జెడ్పీటీసీలు విజయం సాధించి రాష్ట్రంలోని అన్ని జిల్లా పరిషత్‌లను సునాయాసంగా సొంత చేసుకుంది అధికార వైఎస్సార్‌సీపీ.ఓ వైపు కొవిడ్.. మరోవైపు దుష్ప్రచారాల నడుమ పాలన సాగిస్తున్నామని జగన్ అన్నారు. అబద్ధాలను నిజం చేయడానికి కొన్ని కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని ప్రతిపక్షాలపై జగన్ విరుచుకుపడ్డారు. వారికి సంబంధించిన వ్యక్తి ముఖ్యమంత్రి స్థానంలో లేడు కాబట్టి.. ప్రస్తుతం సీఎంను దించేయాలని యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఓటమిని కూడా అంగీకరించలేని పరిస్థితుల్లో ఎన్నికల ఫలితాలకు వక్ర భాష్యాలు చెబుతున్నారని జగన్ విమర్శించారు. వైసీపీ గెలుపును జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. పార్టీ గుర్తుతో జరిగిన ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వాన్ని దీవిస్తే.. దానికి కూడా జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలను అడ్డుకునేందుకు నానా ప్రయత్నాలు చేశారు. కోర్టుకు వెళ్లి ఎన్నికలు అడ్డుకున్నారు. పోలింగ్ జరిగిన తర్వాత కూడా ఆరు నెలల పాటు ఫలితాలు వాయిదా పడేలా చేశారు. ఏడాదిన్నర క్రితమే ఎన్నికలు జరిగి ఉంటే గెలిచిన అభ్యర్థులు కరోనా సమయంలో ప్రజలకు అండగా ఉండేవారని జగన్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రభుత్వానికి అండగా నిలబడ్డ ప్రజలకు రుణపడి ఉంటామని జగన్ తెలిపారు. ఈ విజయం ఇచ్చిన ఉత్సాహంతో మరింత భాధ్యతగా పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు

## 'టీడీపీకి ఓటమిని అంగీకరించే ధైర్యం లేదు'

### మంత్రి బొత్స సత్యనారాయణ

విజయవాడ: సంక్షేమ పాలనకు ప్రజలు పట్టం కట్టారని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆయన సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల బహిష్కరణ అనేది టీడీపీ డ్రామా అని మండిపడ్డారు. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ ఓటమిని అంగీకరించి ఫలితాలను విశ్లేషించుకోవాలని హితవు పలికారు. టీడీపీకి ఓటమిని అంగీకరించే ధైర్యం లేదని మండిపడ్డారు.రాజకీయాల్లో క్రిమినల్ మైండ్ సెట్ ఒక్క చంద్రబాబుకే ఉందని దుయ్యబట్టారు. టీడీపీ అని అయిపోయిందని, చంద్రబాబుకు జవసత్వాలు లేవని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు తన బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు.




## ఎన్నికల ఫలితాలపై రెండు మూడు రోజుల్లో స్పందిస్తా: పవన్



అమరావతి: పరిషత్ ఎన్నికల్లో జనసేన విజేతలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులందరూ బలమైన పోరాటం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించిన ఫలితాల మేరకు 177 ఎంపీటీసీ, 2 జెడ్పీటీసీ స్థానాలను జనసేన అభ్యర్థులు గెలిచారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ఎలాంటి పరిస్థితుల్లో జరిగాయన్న అంశానికి సంబంధించి పూర్తి సమాచారం తమ దగ్గర ఉందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల ఫలితాలపై రెండు మూడు రోజుల్లో సంపూర్ణ విశ్లేషణతో స్పందిస్తానని తెలిపారు.

## ఏపీలో కొత్తగా 839 కేసులు.. 8 మరణాలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా 42,679 పరీక్షలు నిర్వహించగా.. 839 కేసులు నిర్ధారణ అయ్యాయి. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలో 20,39,529 మంది వైరస్ బారినపడినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.



గడిచిన 24 గంటల వ్యవధిలో కొవిడ్ వల్ల ఎనిమిది మంది మరణించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మృతుల సంఖ్య 14,078కి చేరింది. 24 గంటల వ్యవధిలో 1,142 మంది బాధితులు కోలుకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కోలుకున్న వారి సంఖ్య 20,11,063కి చేరినట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 14,388 యాక్టివ్ కేసులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,77,63,761 నమూనాలను ఆరోగ్య శాఖ పరీక్షించింది.

# నియోజకవర్గానికి దూరంగా సుచరిత



గుంటూరు సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)నిజానికి.. వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు అందరూ తమ తమ నియోజకవర్గాల్లో ఉంటూ. పనులు చేస్తున్నారు. కొందరు మౌనంగా ఉన్నప్పటికీ.. ఇంటికే పరిమితమైనప్పటికీ.. సొంత పనుల్లో మునిగి తేలుతున్నారు. మొత్తంగా తమ తమ నియోజకవర్గాలపై అయితే, అంతో ఇంతో ప్రేమను కురిపిస్తున్నారు. కానీ, ఎటొచ్చీ.. హోం మంత్రి మేకతోటి సుచరిత విషయంలోనే వ్యతిరేకత వస్తోందని అంటున్నారు నియోజకవర్గంలోని పరిశీలకులు. గుంటూరులోని ప్రత్తిపాడు నియోజవకర్గం నుంచి విజయం సాధించిన సుచరిత.. దాదాపు నియోజకవర్గానికి చాలా దూరంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికి కేవలం రెండు మూడు సార్లు మాత్రమే నియోజకవర్గంలో కనిపించారని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. గత ఏడాది ఎన్నికల సమయంలో స్థానికంగా ఉన్న అనేక సమస్యలు పరిష్కరిస్తామంటూ.. సుచరిత హామీ ఇచ్చారు. కానీ, ఏడాదిన్నర అయినా.. ఆమె ఇక్కడి సమస్యలపై దృష్టి పెట్టింది లేదు. పైగా.. నియోజకవర్గానికి కూడా వెళ్లడం మానేశారని అంటున్నారు. ఎంతసేపూ.. గుంటూరులోని అరండల్ పేటలో ఉన్న ఇంటికే పరిమితమవుతున్నారని, దీంతో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో కేవలం స్థానిక నేతలతో మాత్రమే అప్పుడప్పుడు టచ్‌లో ఉంటోన్న సుచరిత నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడడమే మానేశారని అంటున్నారు. కరోనా టైంలోనే కాదు.. అంతకు ముందు కూడా ఆమె నియోజకవర్గ ప్రజలు మొఖం చూపించలేదు. మంచినీళ్లు సరిగా లేని పరిస్థితి. చివరకు నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోనే రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గుంటూరు రూరల్ మండలంలో చాలా గ్రామాల్లో రహదారులు, మంచినీళ్లు లేవు. హోం మంత్రిగా ఉండడంతో నేరుగా మంత్రిని ఎట్టడం లేదని, దీంతో తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోలేక పోతు న్నామని ఇక్కడి వారు వాపోతున్నారు. ఇక, తనకు ఇక్కడ తిరుగులేదని మంత్రి సుచరిత భావిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. రాజకీయంగా టీడీపీ కి ఇక్కడ నాయకుడే లేకపోవడం, పార్టీ జెండా మోసే నేత కూడా లేకపోవడం సుచరిత ధీమా కు కారణంగా కనిపిస్తోంది. గతంలో మంత్రిగా పనిచేసి బీజేపీలో చేరిన రావెల కిశోర్‌బాబును కూడా ఎవరూ పెద్దగా పట్టించు కోకపోవడం లేదు. ఇక ఇక్కడ టీడీపీకి ఎవ్వరూ నాయకుడు లేకపోవడంతో చివరకు చంద్రబాబు అవుట్ డేటెడ్ లీడర్ అయిన మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్యను పార్టీ బాగోగులను చూడాలని ఆదేశించారు.

# గుజరాత్ టు విజయవాడ.. హెరాయిన్ సరఫరా వార్తలు అవాస్తవం: విజయవాడ సీపీ




విజయవాడ: గుజరాత్ నుంచి విజయవాడకు హెరాయిన్ సరఫరా చేస్తున్నారనే వార్తలు అవాస్తవమని విజయవాడ పోలీస్ కమిషనర్ బత్తిని శ్రీనివాసులు తెలిపారు. గుజరాత్ ముంద్రా పోర్టు నుంచి దిల్లీకి హెరాయిన్ తరలిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ మేరకు సీపీ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆషీ కంపెనీ లైసెన్స్‌లో విజయవాడ చిరునామా ఉందన్న మాట వాస్తవమే అయినా విజయవాడ కేంద్రంగా కంపెనీ కార్యకలాపాలు జరగట్లేదన్నారు. చెన్నై, అహ్మదాబాద్, దిల్లీలో దర్యాప్తు సంస్థలు తనిఖీలు చేశాయని చెప్పారు. విజయవాడ చిరునామాతో ఉన్న కంపెనీ యజమాని చెన్నైలో ఉంటారని.. చాలా ఏళ్ల క్రితమే చెన్నైలో స్థిరపడ్డారని సీపీ ప్రకటనలో వెల్లడించారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుజరాత్‌లో రూ. 9వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాలను పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ డ్రగ్స్ ముఠాకు విజయవాడతో సంబంధాలు ఉన్నాయని నిఘా వర్గాల సమాచారంతో.. డీఆర్ఐ అధికారులు గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకున్న కంటైనర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిల్లో తనిఖీలు చేయగా భారీగా హెరాయిన్ బయటపడింది. వాటి విలువ దాదాపు రూ. 9వేల కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ కంటైనర్లు అఫ్గానిస్థాన్ నుంచి వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కంటైనర్లు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన ఓ ట్రేడింగ్ సంస్థకు చెందినవిగా గుర్తించారు.

# కమలా హారిస్, టిమ్ కుక్‌తో భేటీ కానున్న మోదీ!

### ఈ నెలలో 3 రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్న మోదీ

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజులపాటు అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్ ఆతిథ్యంలో జరగనున్న క్వాడ్ నేతల సదస్సులో పాల్గొననున్నారు. అలాగే అమెరికా ఉపాధ్యక్షురాలు, భారత సంతతి మహిళ కమలా హారిస్, ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ సీఈఓ టిమ్ కుక్‌తో సమావేశం కానున్నట్లు సమాచారం. మోదీ సెప్టెంబర్ 22న అమెరికా రాజధాని వాషింగ్టన్‌కు చేరుకోనున్నారు. ఆ తర్వాతి రోజు అక్కడి పలు ప్రముఖ సంస్థలకు చెందిన సీఈఓలతో సమావేశం కానున్నారు. వారిలో టిమ్ కుక్ కూడా ఉండనున్నట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. అలాగే కమలా హారిస్‌తోనూ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే రోజు ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్, జపనీస్ ప్రధాని యోషియిడే సుగాతో సమావేశం కానున్నారు. ఇదిలా ఉండగా.. మోదీ, బైడెన్ మధ్య అఫ్గానిస్థాన్ పరిణామాలు, కొవిడ్-19, వాతావరణ మార్పులు, ఇండో-పసిఫిక్, ఉగ్రవాదం వంటి పలు అంశాలు చర్చకు రానున్నట్లు సమా చారం. అలాగే పర్యటనలో చివరి రోజున యూఎన్ జనరల్ అసెంబ్లీలో మోదీ ప్రసంగిం చనున్నారు. మార్చిలో బంగ్లాదేశ్ పర్యటన తర్వాత ఈ ఆరు నెలల వ్యవధిలో ప్రధాని వెళ్తోన్న తొలి అంతర్జాతీయ పర్యటన ఇది.



# ఏపీ ఫైబర్ నెట్ కేసులో సాంబశివరావుకు హైకోర్టులో ఊరట

అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్)కు సంబంధించిన కేసులో రెండు రోజుల కిందట అరెస్టైన ఐఆర్‌టీఎస్ అధికారి కోగంటి సాంబశివరావు హైకోర్టులో ఊరట లభించింది. మధ్యంతర బెయిల్ పిటిషన్‌తో పాటు సీఐడీ నమోదు చేసిన కేసు కొట్టేయాలని నిన్న ఆయన దాఖలు చేసిన పిటిషన్‌లపై ఇవాళ విచారణ జరిగింది. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. 48 గంటల్లో బెయిల్ రాకపోతే తన ఉద్యోగం పోతుందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం సాంబశివరావుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఏపీఎస్ఎఫ్ఎల్‌కు సంబంధించిన తొలి దశ టెండర్లను గత ప్రభుత్వ హయాంలో టెరా సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అక్రమంగా కట్టబెట్టారన్న ఆరోపణలపై నమోదైన కేసులో సాంబశివరావును సీఐడీ అధికారులు శనివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



# సంపాదకీయం

మంగళవారం 21 సెప్టెంబరు 2021

## బాక్ట్రియన్ నిధి కోసం తాలిబన్ల వేట

తాలిబాన్ సమాచార మరియు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ బ్యాక్ట్రియన్ గోల్డ్ నిధిని గుర్తించడానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు చెప్పింది. ఈనిధి నాలుగు దశాబ్దాల క్రితం ఉత్తర అఫ్గాన్‌లో జ్వాజియన్ ప్రావిన్స్‌లో షేర్‌బర్ఘన్ జిల్లాలోని తిల్యా తెపే ప్రాంతంలో వెలుగులోకి వచ్చింది. ఈ నిధి విషయంపై తాలిబాన్ తాత్కాలిక క్యాబినెట్ సాంస్కృతిక కమిషన్ డిప్యూటీ హెడ్ అహ్మదుల్లా వాసిక్ మాట్లాడుతూ.. బాక్టీరియన్ ఇప్పుడు ఎక్కడ ఉందో కనుగొని తనిఖీ చేసే బాధ్యతను సంబంధిత శాఖలకు అప్పగించినట్లు చెప్పారు.అయితే ఈ నిధి ఆఫ్ఘనిస్తాన్ ను సోవియట్ యూనియన్ ఆక్రమించడానికి కొన్ని సంవత్సరాల క్రితం గ్రీక్-రష్యన్ పురావస్తు శాస్త్రవేత్త విక్టోర్ సరియాందీ నేతృత్వంలో సోవియట్-అఫ్గాన్ పురావస్తు పరిశోధన బృందం కనుగొంది. ఉత్తర అఫ్గాన్‌లో జ్వాజియన్ ప్రావిన్స్‌లోని తిల్యా తెపే అనే ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో భారీ ఖజానా వెలుగులోకి వచ్చింది. ఈ ఖజానాలో 20,600 పురాతన వస్తువులు లభించాయి. బంగారు ఆభరణాలు, బంగారు నాణేలు, బొమ్మలు, పలు రకాల వస్తువులు సహా భారత్ లోని ఏనుగు దంపతలతో చేసిన కళాకండాలు కూడా ఈ నిధిలో ఉన్నాయి. ఇవన్నీ క్రీస్తుపూర్వం 1వ శతాబ్ధకాలానికి చెందినవిగా అప్పటి పురావస్తు శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ముఖ్యంగా ఆరవ సమాధిలో కనిపించే బంగారు కిరీటం అద్భుతమని నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ 2016 లో ఓ కథనంలో పేర్కొంది.ఈ ప్రాంతంలో వెలుగులోకి వచ్చిన నిధి ఆ ప్రాంతం పురావస్తు సంపదకు గని వంటిదని విక్టోర్ బ్యాక్ట్రియన్ అభిప్రాయపడ్డారు. ఇక 4వ శతాబ్దంలో అలెగ్జాండర్ ది గ్రేట్ బ్యాక్ట్రియన్‌ను ఆక్రమించాడు. అనంతరం ఈ ప్రాంతం పలు దండయాత్రలకు గురైంది. ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొంది. దీంతో పలు సంస్కృతులకు సంబంధించిన ఆనవాళ్లు అక్కడ నిక్షిప్తమైపోయాయి.అయితే మిగిలిన వస్తువులు పేద దేశానికి పెద్ద ఆదాయ వనరుగా మారింది. పలు దేశాల్లో నిధిలోని వస్తువులను ప్రదర్శనకు ఉంచి డబ్బులు అందుకుంది. దీనిని 2006 నుంచి 13 సార్లు విదేశాల్లో ప్రదర్శనలకు పెట్టింది. పారిస్‌లో తొలిసారి ప్రదర్శించారు. చివరిసారిగా 2020లో హాంకాంగ్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనల ద్వారా అఫ్గాన్ ప్రభుత్వానికి 4.5 మిలియన్ డాలర్ల ఆదాయం లభించింది.అయితే అప్పటి దేశ దిగువ సభ సభ్యుడు మిర్ రహ్మాన్ రెహ్మానీ ఈ ఏడాది జనవరిలో పార్లమెంట్‌లో అఫ్గానిస్థాన్‌లోని అవినీతి బ్యాక్ట్రియన్ సంపదకు ప్రమాదంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయన ఈ నిధిని తగిన విధంగా భద్రపరచాలి ప్రతిపాదన చేసప్రు. అయితే ఈ ప్రతిపాదన ముందుకుసాగలేదు.. ఇక ఇప్పుడు ఈ బంగారు నిధి తాలిబన్లు హస్తగతం చేసుకున్న ప్రాంతంలో ఉండిపోయింది. ఈ వారసత్వ సంపాదన తాలిబన్ల కంట పడితే.. ప్రమాదమని పురావస్తు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అక్కడ ఆర్థిక పరిస్థితులు అగమ్యగోచరంగా మారింది. అఫ్గాన్ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. దీంతో వివిధ దేశాల్లో ఉన్న అఫ్గాన్ రిజర్వులు, బంగారాన్ని ఆయా దేశాలు స్తంభింపజేశాయి. దీంతో తాలిబన్లు డబ్బులు లేక కటకటలాడుతున్నారు. విదేశీయులు నిధుల కోసం తాము మారిపోయామని.. మంచి పాలన అందిస్తామని హామీల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆఫ్గనిస్తాన్ లో ఉన్న పరిస్థితుల్లో అత్యంత పురాతన స్వర్ణ నిధి 'బ్యాక్ట్రియన్ ట్రెజరీ'గురించి పురావస్తు నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరో వైపు ఆఫ్ఘనిస్తాన్ ను ఆక్రమించిన ఒక నెల తరువాత, తాలిబాన్ దేశం కోసం కొత్త సైన్యాన్ని సిద్ధం చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ పని త్వరలో పూర్తవుతుందని చెప్పింది. ఆపద్ధర్మ ప్రభుత్వంలోని చీఫ్ ఆఫ్ స్టాఫ్ క్వారీ ఫసియుద్దీన్ ప్రకారం, కొత్త ఆఫ్ఘన్ సైన్యంలో మునుపటి పాలనలో సైన్యంలో భాగమైన మాజీ సైనికులు కూడా ఉంటారు. ఖారీ చెప్పారు- ఆఫ్ఘనిస్తాన్ బయట, లోపల నుండి ఎలాంటి బెదిరింపులు ఎదురైనా, వాటిని ఎదుర్కోవడానికి మా సైన్యం సిద్ధంగా ఉంటుంది.దేశ భద్రతపై దృష్టి సారించిన తాలిబాన్ తన సైన్యాన్ని నిర్మించడానికి సిద్ధమైంది. టోలో న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, కరి మాట్లాడుతూ- మేము మా దేశాన్ని చాలా ప్రేమిస్తున్నాము. ఇతర దేశాల మాదిరిగానే, మనం కూడా ఒక సాధారణ సైన్యాన్ని కలిగి ఉండాలి. అది చాలా త్వరగా జరుగుతుంది. దీని ద్వారా మన ప్రజలను, మన సరిహద్దులను కూడా కాపాడుతాము.మునుపటి పాలనలో సైన్యంలో ఉన్నవారిలో సమర్ధులు మన సైన్యంలో చేరతారు. ఇది శిక్షణ పొందిన తాలిబాన్లను కూడా కలిగి ఉంటుంది. పాత సైనికులు ముందుకు వచ్చి తమ విధుల్లో చేరాలి. మాజీ సైనికాధికారి షకురుల్లా సుల్తానీ మాట్లాడుతూ ? ప్రస్తుతం ఖాళీగా ఉన్న 3 లక్షల మంది మాజీ సైనికుల గురించి తాలిబాన్లు ఆలోచించాలన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రస్తుతం సాధారణ సైన్యం లేదు. తాలిబాన్లు నగరాలు, సరిహద్దులలో నిలబడ్డారు. వారి వద్ద కొన్ని కొత్త, కొన్ని పాత ఆయుధాలు ఉన్నాయి.

# మెట్రో ఎప్పుడు...



విశాఖపట్టణం, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఏపీ ఏర్పడి దాదాపు ఏడేళ్లన్నరేళ్లు కావస్తోంది. విభజన హామీలో భాగంగా విశాఖకు రైల్వే జోన్ తోపాటు మెట్రో ట్రైన్ ప్రాజెక్టు రావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఏపీకి మెట్రో ట్రైన్ ప్రాజెక్టు మంజూరు కాకపోవడం శోచనీయంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ కు మాత్రమే మెట్రో రైలు ప్రాజెక్టును అప్పటి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. టీఆర్ఎస్ సర్కారు హయాంలో మెట్రో ట్రైన్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీంతో హైదరాబాద్లో కొంతమేర ట్రాఫిక్ కష్టాలు తీరిపోయాయి. ఈ సదుపాయం వల్ల నగరవాసులకు రవాణా విషయంలో చాలా ఊరట కలిగిందని చెప్పొచ్చు.నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కనీసం రాజధాని సైతం నిర్మించలేక పోయారు. ఇక ప్రతిష్టాత్మకమైన మెట్రో ట్రైన్ ప్రాజెక్టును ఏకంగా గాలికొదిలేశారు. దీంతో ఏపీకి మెట్రో ట్రైన్స్ సదుపాయం లేకుండా పోయింది. రోజురోజుకు పెరిగిపోతున్న నగర జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ కష్టాలను దూరం చేసేందుకు కేంద్రం మెట్రో రైళ్ల ప్రాజెక్టులను అన్ని రాష్ట్రాలకు కల్పించాల్సిన అవసరం ఉంది. కానీ ఏపీకి మాత్రం మెట్రో ప్రాజెక్టు విషయంలో బీజేపీ సర్కారు మొండిచేయి చూపిస్తుంది.దేశంలోని ఈశాన్య, కేంద్ర ప్రాంతాలు మినహాయిస్తే అన్ని రాష్ట్రాల్లో మెట్రో రైళ్ల వ్యవస్థ అందుబాటులో ఉంది. దేశ రాజధాని ఢిల్లీకి మెట్రో రైల్ వ్యవస్థ గుండెకాయగా మారింది. అక్కడ మరింత రైళ్ల నెట్ వర్క్‌ను ప్రభుత్వం విస్తరిస్తోంది. తాజాగా నజఫ్ గడ్ నుంచి దౌసా బస్టాండ్ వరకు నిర్మించిన మెట్రో రైల్వే అందుబాటులోకి వచ్చింది. దీనిని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తాజాగా ప్రారంభించారు. కాగా కేంద్రం 2022 ఆర్థిక సంవత్సరానికి కొత్తగా 900 కిలోమటర్ల మేరకు మెట్రో రైల్ ప్రాజెక్టును వేర్వేరు రాష్ట్రాలకు మంజూరు చేసింది.వీటిలో 740 కిలోమీటర్ల మేరకు మెట్రో రైలు ప్రాజెక్టు పనులు నిర్మాణంలో ఉన్నాయి. ఇక వచ్చే ఏడాది మంజూరు కాబోయే 900 కిలోమీటర్లను మెట్రో రైల్వే విస్తరణను పరిగణలోకి తీసుకుంటే మొత్తంగా 2వేల కిలోమీటర్ల మెట్రో రహదారి అందుబాటులో రానుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతీయేటా కేంద్రం కొత్త మెట్రో ప్రాజెక్టులను మంజూరు చేస్తోంది. నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోంది. అయితే ఏపీకి మాత్రం ఇప్పటి కూడా ఒక్క మెట్రో ప్రాజెక్టు కూడా మంజూరు చేయకపోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.దేశంలోని ప్రధాన రాష్ట్రాల్లోని ముఖ్య నగరాల్లో మెట్రో ట్రైన్ వ్యవస్థ అందుబాటులో ఉంది. దక్షిణాదిలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తిరువనంతపురంలో మెట్రో ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసింది. ఇవన్నీ కూడా ఇప్పుడు పరుగులు పెడుతున్నాయి. కానీ దక్షిణాదిలో మెట్రో ట్రైన్ లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోతుంది. నవ్యాంధ్రకు మెట్రో ట్రైన్ ప్రాజెక్టు సాధించడంలో గత టీడీపీ సర్కారు ఘోరంగా విఫలమైంది.అధికారంలో ఉన్న వైసీపీ కేంద్రంలోని బీజేపీతో సత్సంబంధాలు కొనసాగిస్తుంది. దీంతో సీఎం జగన్మోహన్ రెడ్డి హయాంలోనైనా ఏపీకి మెట్రో ప్రాజెక్టును తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై సీఎం జగన్మోహన్ రెడ్డి దృష్టిసారించాలని అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# లోకేష్ మెడకు ఫైబర్ నెట్ స్కామ్



విజయవాడ, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఫైబర్ నెట్ కుంభకోణం తెలుగుదేశం పార్టీ అగ్రనేతలకు ఇబ్బంది పెట్టేలా కన్పిస్తుంది. ప్రధానంగా నారా లోకేష్ టార్గెట్ గానే ఈ కేసు ముందుకు నడుస్తున్నట్లు అనుమానాలున్నాయి. ఫైబర్ నెట్ కేసులో ఇప్పటికే అప్పటి ఎండీ సాంబశివరావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో తర్వాత అరెస్ట్ ఎవరన్నది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో తొలుత 19 మందిపై సీఐడీ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.ఫైబర్ నెట్ మాజీ ఎండీ సాంబశివరావు అరెస్ట్ తో టీడీపీలో కొంత బెరుకు మొదలయింది. గత తెలుగుదేశం ప్రభుత్వం ఫైబర్ నెట్ ప్రాజెక్టును అమలులోకి తెచ్చింది. టెరాసాఫ్ట్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా టెండర్లను ఖరారు చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ కేసులో 330 కోట్ల అవినీతి జరిగిందని సీఐడీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. రెండు వేల కోట్ల విలువైన టెండర్ల మొదటి దశలోనే అవకతవకలు జరిగినట్లు చెబుతున్నారు.ఫైబర్ నెట్ ప్రాజెక్టు విషయంలో అప్పటి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాత్ర ఉందన్నది వైసీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం జైలు పాలయిన సాంబశివరావు పై లోకేష్ వత్తిడి తెచ్చి టెండర్లను ఆమోదించినట్లు విమర్శలున్నాయి. టెండర్ల గడువును పొడిగించడమే కాకుండా, ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్ ను సయితం ఆమోదించి టెండర్లను టెరాసాఫ్ట్ కంపెనీకి ఖరారు చేశారంటున్నారు.ఫైబర్ నెట్ కేసులో మరికొన్ని అరెస్ట్ లు ఉంటాయంటున్నారు. ఇందులో నారా లోకేష్ పాత్రపై ఆధారాలను సీఐడీ అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. లోకేష్ విషయంలో స్పష్టమైన ఆధారాలను లభిస్తే ఆయన పేరు కేసులో ప్రధానంగా చేర్చే అవకాశముందని తెలుస్తోంది. ఇందుకోసం ఈ కేసులో నిందితులను సీఐడీ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. మొత్తం మీద రానున్న కాలంలో ఫైబర్ నెట్ కుంభకోణం ఇటు రాష్ట్ర రాజకీయాలతో పాటు టీడీపీని కూడా కుదిపేసే అవకాశముంది.

# 11 మందికి ఎదురీతేనా

విజయవాడ, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో జగన్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతోంది. మరో మూడు నెలల తర్వాత అంటే దసరాకు కాస్త అటూ ఇటూగా జగన్ తన కేబినెట్లో భారీ ప్రక్షాళనకు రెడీ అవుతున్నారు. జగన్ కేబినెట్ లో మొత్తం 25 మంది మంత్రులు ఉన్నారు. ఈ మంత్రుల పనితీరుపై జగన్ ఇప్పటికే మూడు నాలుగు నివేదికలు కూడా తెప్పించుకున్నట్టు తెలుస్తోంది.వీరిలో ఎవరు ఉంటారో ? ఎవరు అవుట్ అవుతారో కాని.. వైసీపీ వర్గాల్లోనూ, మీడియాలోనూ జరుగుతోన్న ప్రచారం ప్రకారం 11 మంది మంత్రులను ఖచ్చితంగా తప్పిస్తారని అంటున్నారు. ఈ లిస్టులో వెల్లంపల్లి శ్రీనివాసరావు, సుచరిత, తానేటి వనిత, పుష్పశ్రీ, రంగనాథరాజు, జయరాం, శంకరనారాయణ, అనిల్ కుమార్ యాదవ్, నారాయణ స్వామి, విశ్వరూప్, అవంతి శ్రీనివాస్ ఉన్నారు.ఈ మంత్రులను తప్పించే క్రమంలో కొందరు విషయంలో పనితీరును ప్రాతిపదికగా తీసుకుంటే.. మరి కొందరి విషయంలో సామాజిక సమీకరణలను కూడా బేస్ చేసుకోనున్నారట. పైన చెప్పుకున్న మంత్రుల్లో చాలా మంది మంత్రుల పనితీరు మరీ అధ్వానంగా ఉందని నివేదికలు జగన్ వద్దకు చేరినట్టు తెలుస్తోంది. వెల్లంపల్లి బదులు అన్నా రాంబాబు లేదా కోలగట్లకు ఛాన్స్ ఉండొచ్చు..! జయరామ్, శంకర్ నారాయణ ప్లేసులో బీసీ మంత్రులే వస్తారా ? లేదా ఆ జిల్లాల్లో రెడ్డి మంత్రులు ఉంటారా అన్నది చూడాలి.అనిల్ బదులు పార్థసారథి పేరుతో పాటు కారుమూరి నాగేశ్వరరావు పేరు కూడా లైన్ లో ఉంది. రంగనాథ రాజు బదులు ప్రసాదరాజుకు ఛాన్స్ ఖాయం. ఇక నలుగురు కాపు మంత్రుల్లో ఖచ్చితంగా ఇద్దరు అవుట్ కానున్నారు. మూడో కాపు మంత్రి కూడా బయటకు వెళ్లినా ఆశ్చర్యం లేదంటున్నారు. పుష్ప శ్రీ బదులు రాజన్నదొర లేదా బాలరాజుకు ఛాన్స్ ఖాయం. ఏదేమైనా ఎక్కువ మంది మంత్రుల పనితీరుపై జగన్ సంతృప్తితో లేరు.ముందస్తుకు నో...ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందస్తు ఎన్నికలకు ఎందుకు వెళతారు? ఆ ఆలోచన చేస్తున్నారా? ముందస్తు ఎన్నికలకు వెళితే వైసీపీ విజయం సాధ్యమేనా? ఇదీ ప్రస్తుతం వైసీపీలో జరుగుతున్న చర్చ. అయితే ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు ఎలాంటి అవకాశాలు కన్పించడం లేదు. జగన్ ఇప్పుడు ఏపీలో బలంగా ఉన్నారు. విపక్షాలు వీక్ గా ఉన్నాయి. సంక్షేమ పథకాలతో జనం మద్దతును కోరే ప్రయత్నం జగన్ తొలి నుంచి చేస్తున్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో కుటుంబాలను పథకాలతో తన పరం చేసుకోగలిగారు.ఇంకా జగన్ చేయాల్సి చాలా ఉంది. ఇటు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను కూడా చేసి చూపెట్టాల్సి ఉంది. దీంతో పాటు మూడు రాజధానుల అంశాన్ని కూడా తేల్చుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ జరగకుండా జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచన చేస్తారా? అన్నది ప్రశ్న. జగన్ కు గత ఎన్నికల్లో 151 మంది ఎమ్మెల్యేలను ఇచ్చి ఏపీలో బలంగా నిలిపారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కాదనుకుని ముందస్తు ఎన్నికలకు వెళితే చేతకానితనంగా భావించారా? అన్న సందేహం కూడా వ్యక్తమవుతుంది.నిజానికి జగన్ 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తొలి నుంచి ప్రయత్నం మొదలు పెట్టారు. సంక్షేమ పథకాలను వేగవంతంగా అమలు చేసి తర్వాత మిగిలిన వాటిపై దృష్టి పెట్టాలనుకున్నారు. కానీ అనుకోకుండా కరోనా రావడం దాదాపు రెండేళ్లు కరోనాతోనే సమయం గడిచిపోవడంతో అనుకున్న పనులను పూర్తి చేయలేకపోయారు. ఇటు పార్టీని బలోపేతం చేసుకోవడంతో పాటు ప్రభుత్వ పరంగా అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకోవాల్సి ఉంది.జగన్ డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన పేదలకు ఇంటిస్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఇది పూర్తి స్థాయిలో అమలు కావాలంటే ఇంకా సమయం పడుతుంది. ఆర్థిక ఇబ్బందులు కొంత వెనక్కు లాగుతున్నాయి. అందుకే జగన్ కు ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచన లేదని, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడంతో పాటు అన్ని సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో గ్రౌండ్ అయిన తర్వాతనే ముందస్తు ఎన్నికలకు వెళతారంటున్నారు.

# పల్నాడు ప్రాంతం సుభిక్షందిశగా అడుగులు

గుంటూరు, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలోకి వచ్చే మూడు నియోజకవర్గాల్లో వైసీపీ జోరు మరింత పెరగనుందా ? ఇక్కడ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగేందుకు జగన్ వేస్తున్న అడుగులు ప్రయోజనం కలిగిస్తాయా ? అంటే.. తాజా పరిణామాలను గమనిస్తున్న వారు ఔననే అంటున్నారు. మాచర్ల, వినుకొండ, గురజాల ప్రాంతాల ప్రజలు కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వరికపూడి సెల పథకానికి జగన్ కేబినెట్ తాజాగా ఆమోద ముద్ర వేసింది. అంతేకాదు, దాదాపు వెయ్యి కోట్ల రూపాయలకు కూడా ఈ పథకం అమలుకు కేటాయించింది. పల్నాడులోనే బాగా వెనకపడిన నియోజకవర్గాలుగా వినుకొండ, గురజాల, మాచర్లకు సాగునీరు, తాగునీరు కొరత తీవ్రంగా ఉంది. ఈ మూడు నియోజకవర్గాలకు కూడా వరికలపూడి సెల అత్యంత కీలకం. సాగు, తాగునీరు అందించే ఈ పథకాన్ని పూర్తి చేయాలని దాదాపు మూడు దశాబ్దాలకు పైగా డిమాండ్ ఉంది.ఈ మూడు నియోజకవర్గాల్లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. రైతాంగం ప్రధాన డిమాండ్ కూడా ఇదే వినిపిస్తోంది. గత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి కూడా ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పూర్తి చేయాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. దీంతో ఎన్నికల్లో నేతలకు ఈ ప్రాజెక్టు ప్రధాన హామీగా ఉండేది. కానీ, ఏ ఒక్కరూ దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేదు. 2014లో ఇక్కడ టీడీపీ గెలిచాక ఈ పథకం పూర్తి చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఆ విషయాన్ని మర్చిపోయిన చంద్రబాబు ఎన్నికలకు ముందు అనూహ్యంగా జీవో తీసుకువచ్చారు. ఇక వైసీపీ గెలిచాక ఇది మళ్లీ మరుగున పడింది.ఇక వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు పల్నాడు వైసీపీ ఎమ్మెల్యేలు ఈ పథకం పూర్తి చేసే విషయంలో సీఎం జగన్‌ను పలుసార్లు కలిశారు. ఎట్టకేలకు జగన్ ప్రభుత్వం దీనిపై యుద్ధ ప్రాతిపదికన ముందుకు కదిలేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు సుమారు 3 వేల కోట్లరూపాయలు ఖర్చు అవుతాయని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ క్రమంలోనే దీనికి వెయ్యి కోట్ల పైచిలుకు నిధులు కేటాయించారు. వచ్చే రెండేళ్లలో దీనిని పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు.ఈ పథకం పూర్తయితే కొన్ని శతాబ్దాలుగా వెనకపడ్డ పల్నాడు ప్రాంతం సుభిక్షం అవుతుంది. దీని పూర్తి ద్వారా రైతాంగ సమస్యలే కాకుండా.. ఇక్కడి శ్రామికులకు ఉపాధి లభించనుంది. అదే సమయంలో ఇది పల్నాడులో కొన్ని లక్షల ఎకరాలకు నీరు అందించడంతో పాటు పంట పండనుంది. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడం ద్వారా వైసీపీ మరింత పుంజుకోనే అవకాశం ఉంటుందని అంటున్నారు పరిశీలకులు. మొత్తానికి జగన్ గురి చూసి విసిరిన బాణం పల్నాడు ప్రాంతంలో మూడు నియోజకవర్గాల్లో వైసీపీని తిరుగులేని శక్తిగా మార్చనుంది.

# కాసుల నేతల కోసం వెయిటింగ్

గుంటూరు, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఏ పార్టీ కైనా విపక్షంలో ఉంటూ నెట్టుకు రావడం నేటి డబ్బుతో కూడిన రాజకీయాల్లో బాగా కష్టమైన పని. అందుకే అన్ని పార్టీలు ఆర్థిక పరిపుష్టి బాగా ఉన్న వారిని ఎంచుకుని వారికి నాయకత్వ బాధ్యతలతో పాటు ఎంపీ ఎమ్మెల్యేల టికెట్లు కట్టబెడుతూ వస్తుంటాయి. అధికారంలోకి రాకుండా పార్టీ నిర్వహణ ఖర్చును భరించడం కష్టం అనే భావనతోనే ప్రజారాజ్యం పార్టీని మెగాస్టార్ చిరంజీవి ముందు చూపుతో మూసేశారని రాజకీయ నిపుణులు చెబుతారు. ఇక పవన్ కళ్యాణ్ సైతం పెద్దగా పార్టీ యంత్రాంగం లేకుండా వన్ మెన్ ఆర్మీగా 2014 నుంచి పార్టీని నెట్టుకొస్తున్నారు. 2019 ఎన్నికల తరువాత జనసేన ను విస్తరించే పని పెట్టుకున్నా ఆర్థికంగా పార్టీ ఎక్కడివారు అక్కడి ఖర్చులు భరించక తప్పదన్న ఫార్ములాలోనే సాగుతుంది.ప్రస్తుతం ఏపీ లో ఉన్న అధికార వైసీపీ దెబ్బకు విపక్షాలన్నీ పూర్తిగా కుదేలయిపోయాయి. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షానికి చాలా నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో టికెట్ గ్యారంటీ అనుకున్న వారు సైతం జేబులోనుంచి రూపాయి ఖర్చు చేయడం లేదని క్యాడర్ వాపోతుంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఆర్థికంగా బలంగా ఉన్న వారే టీడీపీ లో ఇంకా కొనసాగుతున్నారు. వీరంతా ఎన్నికల ముందు గాలి ని బట్టి చూసుకుందామనే ధోరణి తో కొనసాగుతున్నారని తెలుస్తుంది. ఎప్పుడో పెదబాబు, చినబాబు వచ్చినప్పుడు తప్ప ఖర్చు చేయడానికి వారికి ధైర్యం చాలడం లేదని టాక్.గత టీడీపీ ప్రభుత్వంలో కోట్ల రూపాయలు కూడగట్టుకున్నా కూడా పార్టీ కష్టకాలంలో ఎవరు ముందుకు రాకపోవడం అధినాయకత్వాన్ని సైతం కలవరపెడుతుంది. ఇదే పరిస్థితి ఇక ముందు కొనసాగి టీడీపీ నేతలు ఆ విధంగానే ముందుకు వెళితే మరింత క్యాడర్ అధికారపక్షంలోకి జంప్ కావడం ఖాయమనే అంటున్నారు అంతా. కరోనా పేరు చెప్పి జనంలోకి రాకుండా కార్యక్రమాలకు ప్రస్తుతం దూరం జరిగినా వచ్చే రెండున్నరేళ్ళు రాజకీయాల్లో జోరు పెంచకపోతే పార్టీకి కష్టమే దాపురిస్తుందని పసుపు దళంలో ఆందోళన మరింతగా పెరుగుతుంది. మరి దీన్ని చంద్రబాబు ఎలా సరిదిద్దుతారో చూడాలి.పరిషత్ ఫలితాలతో తమ్ముళ్లలో నిరాశ రాజకీయాల్లో సమర్థనలు ఎప్పుడూ చెల్లవు. తాము తీసుకున్న నిర్ణయాలు ఒక్కోసారి ఇబ్బందులను తెచ్చిపెడతాయి. ఎంపీ?టీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే సమయంలో చంద్రబాబు ఎన్నికల బహిష్కరణకు పిలుపు నిచ్చారు. ఎన్నికల కమిషనర్ గా నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఉన్నంత వరకూ పోటీకి దిగిన చంద్రబాబు ఆయన పదవీ కాలం పూర్తి కావడంతో ఎన్నికలను బహిష్కరించారు. ఏకగ్రీవాలను సాకుగా చూపి, బెదిరింపులకు దిగారని చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారంటారు.అయితే అనేక చోట్ల పోటీకి ఎవరూ దొరకకపోవడంతోనే బహిష్కరణకు పిలుపునిచ్చారన్న విమర్శలున్నాయి. టీడీపీ నేతలు అనేక చోట్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనడం కారణంగా పోటీకి సుముఖత వ్యక్తం చేయలేదన్నది కూడా వాస్తవమే. దీనికి తోడు పార్టీ నిధులు ఇవ్వాలన్న వత్తిడి కూడా చంద్రబాబు బహిష?కరణకు కారణమని అనే వారు కూడా లేకపోలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో ఈ ఎన్నికల్లో పార్టీ నుంచి నిధుల విడుదల చేయలేక చేతులెత్తేశారని చెబుతారు.ఇప్పుడు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి. దీంతో టీడీపీ శ్రేణుల్లో నీరసం కన్పిస్తుంది. ఎక్కడా టీడీపీ నేతలు ఇళ్లు వదలి బయటకు రాలేదు. కౌంటింగ్ లో తాము పోటీ చేయకపోవడంతో వాళ్లు ఇళ్లకే పరిమితమయ్యారు. పార్టీ తీసుకున్న నిర్ణయానికి బలి కావాల్సి వచ్చిందని మదన పడుతున్నారు. నిజానికి కొందరు బలమైన నేతలే ఉన్నారు. వారిని కొంత ఆర్థికంగా ఎన్నికల్లో ఆదుకుంటే సానుకూల ఫలితాలు వచ్చేవి.కాని చంద్రబాబు మాత్రం నిధుల వ్యయానికి భయపడే ఈ ఎన్నికలను బహిష?కరించారన్నది పార్టీలో బలంగా వినిపిస్తుంది. మరో ఐదేళ్ల పాటు తమకు రాజకీయ అవకాశాలు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫలితాలు విలువలేవని టీడీపీ అగ్రనేతలు కొట్టిపారేస్తున్నా ఈ ఫలితాలు వస్తుండటంతో పార్టీ కింది స్థాయి నేతల్లో నైరాశ్యం అలుముకుందని సీనియర్ నేతలే అంగీకరిస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు తీసుకున్న నిర్ణయం కొందరి రాజకీయ జీవితాన్ని ఐదేళ్లు వెనక్కు నెట్టిందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

# మళ్లీ స్వామి వారి డబ్బులకు ఎసరు

తిరుమల, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఏపీ ప్రభుత్వానికి ఇప్పుడు అప్పు పుట్టడం లేదు. ఇంకా చెప్పాలంటే ఇప్పటికే చేసిన అప్పులు క్రెడిట్ లిమిట్ దాటిపోగా కొత్తగా అప్పు తెచ్చే మార్గమే లేదు. మరోవైపు ప్రభుత్వానికి ఆదాయం గణనీయంగా పడిపోయింది. కరోనాకు ముందే భారీగా తగ్గిన ఆదాయం కాస్త.. కరోనాతో పూర్తిగా చతికిలా పడింది. అయితే, ప్రభుత్వం మాత్రం ఉచిత పథకాలు, నగదు పంపకాలలో ఏ మాత్రం తగ్గడం లేదు. ఉన్నవి చాలదన్నట్లుగా కొత్త పథకాలను తెస్తున్న సర్కార్ అందు కోసం కొంతమేర తిరిగి ప్రజల మీదనే పన్నుల బాదుడు కూడా మొదలుపెట్టింది.ప్రజల మీద పన్ను భారం మోపినా.. ప్రతి నెలా ప్రభుత్వ బాండ్లను తాకట్టు పెట్టినా ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలకు నిధుల కొరత వేధిస్తూనే ఉంది. ఇప్పటికే ఏడాదికి ఉండే అప్పులో డెబ్బై శాతం ఇప్పటికే తెచ్చేసుకున్న



ప్రభుత్వం ఇప్పుడు అప్పుల బాధలో చెల్లింపులకు కొత్త మార్గాలను వెతుకుతుంది. అందులో భాగంగానే తిరుమల శ్రీవారి సొమ్ముకు ఎసరు పెట్టింది. వెంకన్న సొమ్ముతో ప్రభుత్వ బాండ్లను కోలుగోలు చేయించి టీటీడీ సొమ్మును ప్రభుత్వానికి మళ్లించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా వినిపిస్తుందిఅందుకొరకు ముచ్చటగా కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం టీటీడీ సొమ్ము జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తున్నారు. ఈ బ్యాంకుల ద్వారా ప్రస్తుతం 3 నుంచి 4 శాతం మాత్రమే వడ్డీ లభిస్తుంది. అదే ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేస్తే తద్వారా 7 శాతం వడ్డీ లభించే అవకాశం ఉందని టీటీడీ ఆర్థిక మేధావులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ బాండ్లతో పాటు కేంద్ర ప్రభుత్వ బాండ్లను కూడా కొనుగోలు చేస్తామని టీటీడీ పెద్దలు ప్రకటన చేసేందుకు సిద్ధమవుతున్నారు.వచ్చే టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని తెలుస్తుండగా ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో టీటీడీ పెద్దలు చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేస్తామని టీటీడీ పెద్దలు చెప్పినా దాని వెనుక మర్మం మాత్రం టీటీడీ సొమ్మును ప్రభుత్వానికి మళ్లించడమేనని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్యాంకులను కాదని ప్రభుత్వంలో శ్రీవారి పెట్టుబడులు పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతుంది.ఇప్పటికే టీటీడీ భూముల అమ్మకంపై వివాదాలు చెలరేగగా ఈ మధ్యనే రాష్ట్రంలో హిందూ ఆలయాలలో దాడులు, ప్రమాదాలు సంచలనంగా మారి తీవ్ర వివాదాలను రేపుతున్నాయి. ఇవి చల్లారేలోపు టీటీడీ సొమ్ము ప్రభుత్వంలోకి మళ్లించడం మరో వివాదంగా మారడం ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని ఆర్థికంగా ఆదుకొనే సామర్థ్యం ఒక్క ఆ వెంకన్నకే ఉండగా ఆ మార్గాన్ని ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుంది. అయితే, తరతరాలుగా ఎన్నడూ లేని విధంగా టీటీడీ సొమ్ము ప్రభుత్వం వాడుకోవడం మొదలైతే అపరకుభేరుడైన శ్రీవారు సైతం అప్పులపాలు కావడం ఖాయమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరి ప్రభుత్వం ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తుందన్నది చూడాల్సి ఉంది.

# రైతుల కోసం గోనె సంచులు

శ్రీకాకుళం, సెప్టెంబర్ 19, (న్యూస్ పల్స్)రైతుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమం కార్యక్రమాలను చేపడుతోంది. రైతులు ఆరుగాలం శ్రమించి పండిస్తున్న వరి ధాన్యాన్ని విక్రయించేందుకు ఇబ్బందుల్లేకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.15 లక్షల హెక్టార్లలో వరిసాగవుతోంది. గతేడాది వచ్చిన దిగుబడుల ప్రకారం ఈసారి 10.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో బీపీటీలు, సాంబమసూరి వంటి వాణిజ్య ప్రాధాన్యం ఉన్న రకాలు స్థానిక అవసరాల కోసం తీసివేయగా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సొసైటీలు, రైతుభరోసా కేంద్రాలు సంయుక్తంగా ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపడుతున్నప్పటికీ గోనె సంచుల కొరత వేధిస్తోంది. రైతులకు అవసరమైనప్పుడు సంచులు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా గోనె సంచుల ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అధికారుల లెక్క ప్రకా రం 7.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు 1.50 కోట్లు సంచులు అవసరం ఉంది. గతేడాది మిల్లర్లకు ఇచ్చిన 50 లక్షల గోనె సంచులు వారి వద్దే ఉన్నాయి. అధికారుల వద్ద మరో 25 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయి. అంటే ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్ల కోసం 50 శాతం సంచులు సిద్ధంగా ఉన్నట్టే. ఇంకా కావాల్సిన సంచుల కోసం పౌరసరఫరాల శాఖ ప్రభుత్వానికి నివేదిక పంపిస్తోంది. వాస్తవానికి శ్రీకాకుళం జిల్లాలో ఏటా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నప్పుడు కావాల్సిన గోనె సంచులను రైతులు లేదా మిల్లర్లు సమకూర్చుతున్నారు. దీంతో రైతు నుంచి గోనె సంచి రూపంలో అదనంగా రెండు కిలోల ధాన్యాన్ని మిల్లర్లు తీసుకుంటున్నారు. ఈసారి ఇలాంటి ఇబ్బంది లేకుండా పక్క జిల్లా విజయనగరంలో అమలు చేస్తున్న మాదిరిగానే ధాన్యం కొనుగోళ్లు సమయంలో రైతులకు కావాల్సిన గోనె సంచులను ప్రభుత్వమే అందించనుంది. తర్వాత ఈ గోనె సంచిలో మిల్లుకు చేరిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి అదే గోనె సంచిలో మరలా సీఎంఆర్ కింద బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగిస్తారు.

# తక్కువ కు బంగారం ఇస్తానని మోసం

విజయవాడ, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)విజయవాడలో సంచలనం సృష్టించిన తక్కువ ధరకు బంగారం ఇస్తామని మోసం చేసిన కేసులో విస్తుపోయే నిజాలు వెలువడుతున్నాయి. సూర్యారావు పేట పోలీసుల విచారణలో రోజుకో కొత్త విషయాలు బయట పెడుతోంది నిందితురాలు. తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ రైల్వే, దుర్గ గుడి ఉద్యోగుల వద్ద పది కోట్ల రూపాయలను నాగమణి, వెంకటేశ్వరావు దోచుకున్న సంగతి తెలిసిందే. బాధితుల నుండి దోచుకున్న నగదును జల్సాలకు వినియోగించింది నాగమణి. ఈ సొమ్మును ఆన్లైన్ రమ్మీ ఆడడంతో పాటు మద్యానికి నగదు ఖర్చు చేసినట్టు విచారణలో నాగమణి వెల్లడించింది. ఇంట్లో వంట చేసుకునేందుకు కూడా నాగమణి మినరల్ వాటర్ వాడినట్టు చెప్పింది. తమది జమీందారి కుటుంబమని కలరింగ్ ఇచ్చి బాధితుల నుండి దోపిడీకి పాల్పడింది నాగమణి. మరో నాలుగు కేజీల బంగారాన్ని తాకట్టు పెట్టిన నాగమణి వ్యవహారంలో ఒక్కొక్కరుగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారిప్పుడు బాధితులు. భర్త ఉండగానే మృతి చెందాడని చెప్పు రైల్వే టిసి వెంకటేశ్వరవుతో విజయవాడలో స్థిరపడిన తునికి చెందిన నాగమణి ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఇంకా నాగమణి విచారణ కొనసాగుతోంది.

# డిసెంబర్ లోగా టిడ్కో ఇళ్లు ఇస్తాం

విజయనగరం, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఏ రోజైతే కోర్ట్ ఎన్నికల ఫలితాలు లెక్కించమని తీర్పు ఇచిందో అప్పటి నుంచి టీడీపీ ఆందోళన ఆక్రోశం చూస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. 2019లో ప్రతిపక్ష నేతగా సమస్యలు తెలుసుకుని వాగ్దానాలు ఇచ్చారు.. ఇప్పుడు వాటిని పరిష్కరిస్తున్నారు అని సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పనితీరుని చెప్పుకొచ్చారు బొత్స. ప్రజల్లో వ్యతిరేకత ఉందని టీడీపీ అంటోంది.. ఎందుకొస్తుంది వ్యతిరేకత.. ప్రజలకు మేలు చేసినందుకా అంటూ ఆయన ప్రశ్నించారు. టీడీపీ పని అయిపోయింది.. చంద్రబాబుకి జవసత్వాలు లేవు. ఇది మేము చెప్తున్నది కాదు.. ప్రజలిచ్చిన తీర్పు. అందుకే వాళ్ళ భాష, తీరు మారిపోయింది. ప్రవర్తన ప్రజలు ఛీత్కరించుకునే విధంగా ఉండకూడదు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి. జగన్మోహన్ రెడ్డి చేస్తున్న పరిపాలనకు నిన్న వచ్చిన తీర్పు నిదర్శనం. ఎన్నికలు ఎప్పుడు బహిష్కరించాలి.. ప్రజల నాడి తెలిసిన తర్వాత కాదుఇలాంటి కుతంత్రాలు చేయడం, తోక ముడుచుకుని మేము ఎప్పుడు వెళ్ళలేదు. అచ్చెన్నను రాజీనామా చేయమను.. నేను చేస్తాను.. ఇవేమన్నా కుస్తీ పోటీలా." అంటూ బొత్స సత్యనారాయణ నిలదీశారు. ఓటమిని అంగీకరించాలి.. విశ్లేషణ చేసుకోవాలి. ప్రజలు అమాయకులు కాదు.. ఎవరేమి చేస్తున్నారో వాళ్ళకి తెలుసు. ఈ రాష్ట్ర రాజకీయాల్లో క్రిమినల్ మైండ్ సెట్ ఒక్క చంద్రబాబుకే ఉంది. 60 లక్షల మంది గత ప్రభుత్వంలో కట్టించిన ఇళ్ల లబ్ధిదారులకు శాశ్వత హక్కు ఇవ్వబోతున్నాం. 80 వేల టిడ్కో ఇళ్లను డిసెంబర్ లోగా లబ్ధిదారులకు అందిస్తాం." అని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు.

# వ్యాక్సిన్ తో గిఫ్ట్ ఆఫర్లు

చెన్నై, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్): కరోనా నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే వ్యాక్సిన్ ఒక్కటే ఉత్తమం అని అటు అధికారులు.. ఇటు వైద్యులు చెబుతున్నారు. ఐతే వ్యాక్సిన్ వేసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా వస్తాయెమోనని చాలా మంది ఇప్పటికీ వ్యాక్సిన్‌కు దూరంగా ఉంటున్నారు. అపోహలను నమ్మొద్దని డాక్టర్లు సూచిస్తున్నా.. కొందరిలో భయాలు పోవడం లేదు. పట్టణ ప్రాంత ప్రజలు టీకా వేసుకోవడానికి ముందుకు వస్తున్నా.. గ్రామీణ్ ప్రాంతాల్లోని ప్రజలు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో వ్యాక్సినేషన్ ప్రకియను వేగవంతం చేసేందుకు బహుమతులు ప్రకటించారు అధికారులు. తమిళనాడులోని తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టు పంచాయతీ పరిధిలో అందించారు బహుమతులు. అత్తిపట్టులో కరోనా టీకా తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికారులు విన్నూతంగా వ్యాక్సిన్ వేసుకున్నావారికీ స్టీల్ బిందెలు ఇస్తామని ప్రకటించారు. అత్తిపట్టు గ్రామంలో తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వ్యాక్సినేషన్ రెండవ విడత మెగా డ్రైవ్ నిర్వహించారు. మొత్తంగా అత్తిపట్టు గ్రామంలోని పదిహేను వందల మందికీ వ్యాక్సిన్ ఇచ్చారు, వాళ్లందరికీ 700 రూపాయాల విలువైన స్టీల్ బిందెలను గిఫ్ట్ గా అందించారు. స్టీల్ బిందెలను గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సుగంధి వడివేల్ స్పాన్సర్ చేశారు. అలాగే.. తిరువళ్లూర్ మున్సిపాలిటీ పరిధిలో సైతం టీకాలు వేసుకున్నా వారికి లాటరీ ద్వారా ఎంపిక చేసిన 10 మందికి సెల్‌ఫోన్స్ బహుమతులుగా అందజేశారు. వ్యాక్సిన్ వేసుకుని, గిఫ్ట్ తీసుకుని మురిసిపోతున్నారు స్థానికులు.

# దేవాదాయశాఖలో ఇంటి పోరు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్) విశాఖ దేవాదాయశాఖ కార్యాలయంలో కూర్చున్న ఓ అధికారిపై ఓ మహిళా ఉద్యోగి ఇసుక వేయడం. అదీ సీసీ కెమెరాలో రికార్డ్ కావడం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడం.. ఆ వ్యవహారం ఎంత రచ్చ.. చర్చ అయ్యిందో.. ఇప్పుడు అదే అంశంలో మరో విషయం చర్చగా మారింది. ఈ ఏడాది ఆగస్ట్ 5న విశాఖజిల్లా డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఇంఛార్జ్ డిప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ పై అసిస్టెంట్ కమిషనర్ శాంతి ఇసుకతో దాడి చేశారు. ఆపై శాపనార్థాలు పెట్టారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన దేవాదాయశాఖ.. ఆర్జేసీ సురేష్‌బాబుతో విచారణ చేయించింది. తగువుపడ్డ ఇద్దరు అధికారులను విచారించి ఎండోమెంట్ కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. నివేదిక వివరాలు మాత్రం గోప్యంగానే ఉండిపోయాయి. ఆపై ఇరువురు అధికారుల పంచాయితీ అమరావతికి చేరింది. కమిషనర్ ఇద్దరి వాదనలు విన్నారు. కిందిస్థాయి ఉద్యోగి బదిలీని తీవ్రంగా పరిగణించి ఏసీ శాంతి ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు డీసీ పుష్పవర్ధన్. చివరకు ఇద్దరినీ మందలించి పంపించేశారు. ఈ వివాదం టీకప్పులో తుఫాన్‌గా మిగిలిపోతుందని దేవాదాయశాఖ వర్గాలు భావించాయి. ఇంతలో కీలక ఆదేశాలు వెలువడ్డాయి. వైజాగ్ ఇంఛార్జ్ డీసీ పదవి నుంచి పుష్పవర్ధన్‌ను తొలగించి హెడ్‌ఆఫీస్‌కు బదిలీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్‌గానే కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది దేవాదాయశాఖ. ఈ నిర్ణయం పుష్పవర్ధన్‌కే కాదు.. ఆ శాఖ ఉద్యోగులకు షాకింగ్ పరిణామం. పైగా ఏసీ శాంతిని అదేస్థానంలో కొనసాగించడం పుష్పవర్ధన్ అవమానంగా భావించారు. తన తప్పు లేకపోయినా బదిలీ చేశారని కలత చెందిన ఆయన.. ఏకంగా ఉద్యోగానికే రాజీనామా చేశారు. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్ వాణీమోహన్‌కు రిజైన్ లెటర్ ఇచ్చి హైదరాబాద్ వెళ్లిపోయారు. పుష్పవర్ధన్ నిర్ణయం ఇప్పుడు చర్చగా మారింది. ప్రొబేషనరీ కాలం కూడా పూర్తికాని ఒక జూనియర్ అధికారి తనపై ఇసుకతో దాడిచేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా తనను బాధ్యతల నుంచి తప్పించడం ఎంతవరకు కరెక్ట్ అనేది ఆయన ప్రశ్న. సింహాచలం ఆలయ భూముల గోల్‌మాల్ విచారణ కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో పుష్పవర్ధన్ సభ్యుడు. మాన్సాస్, బొబ్బిలి వేణుగోపాలస్వామి గుడి ఆస్తులపైనా ఆయన పనిచేస్తున్నారు. ఇలా కీలక స్థానంలో ఉన్న సీనియర్ అధికారిని అనూహ్యంగా బదిలీ చేయడం ఉద్యోగుల్లో చర్చ జరుగుతోందట. అంతా రాజకీయ ప్రమేయంతోనే జరిగిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పుష్పవర్ధన్ సైతం తాజా పరిణామాలపై సన్నిహితుల దగ్గర వాపోతున్నట్టు తెలుస్తోంది. రాజీనామా నిర్ణయం వెనక బలమైన కారణంతోపాటు భయం ఉందని టాక్. ప్రస్తుతం ఆలయ భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ సమయంలో నిబంధనల మేరకు ఉద్యోగం కత్తిమీద సామే. అదే అభిప్రాయంలో పుష్పవర్ధన్ ఉన్నారట. ఇతర ప్రభుత్వ శాఖలు వేటిల్లోనూ లేనివిధంగా ఇటీవల దేవాదాయశాఖలో అధికారులపై చర్యలు ఉన్నాయి. సింహాచలం భూముల వివాదంలో అప్పటి ఈవో రామచంద్రమోహన్, అసిస్టెంట్ కమిషనర్ సుజాతలపై వేటు వేసింది ప్రభుత్వం. విజిలెన్స్ విచారణ పూర్తయితే ఇంకా చాలామందిపై చర్యలు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. అందుకే కీలక బాధ్యతల్లో ఉంటూ అపవాదులు మూటగట్టుకోవడం అనవసరమనే అభిప్రాయంలో పుష్పవర్ధన్ ఉన్నట్టు వినికిడి. శాఖాపరమైన అంశాల్లో రాజకీయ జోక్యం పెరిగిపోతే.. ఇక ఎవరికోసం పనిచేయాలని ఆయన ఆవేదన చెందుతున్నారట. మరి.. ఈ ఇసుక దుమారం ఇంకెలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి.

# జడ్పీ రేసులో అంతా బంధువులే ...25న ఎన్నికలు

విజయవాడ, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ పరిషత్ ఎన్నికల్లో ఫలితాలు అధికార వైసీపీ ప్రభంజనం సృష్టించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో అత్యధికంగా వైసీపీ సొంతం చేసుకుంది. 13 జిల్లా పరిషత్‌లనూ వైసీపీ చేజిక్కించుకుంది. ప్రాదేశిక ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం కూడా తేలిపోయింది. ఇక, ఇప్పుడు జెడ్పీ చైర్మన్ల సందడి మొదలైంది. గెలిచిన ఆశావహులు అప్పుడే చైర్మన్ పీఠం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ పీఠం ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యింది. అయితే, ఫలితాల్లో అత్యధికంగా వైసీపీ అభ్యర్థులు గెలుపొందడంతో అమాంతం ఆశావహులు పెరగడంతో ఇప్పుడు జెడ్పీ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. విశాఖ జిల్లా లో జెడ్పీ చైర్ పర్సన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చైర్ పర్సన్ పీఠం ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. జిల్లాలో 652 ఎంపీటీసీ స్థానాలకు గానూ 612 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. వాటిలో గొలుగొండ ఎంపీటీసీ బ్యాలెట్ బాక్స్‌లో పత్రాలు తడిసిపోవడంతో ఆ ఫలితం వాయిదా పడింది. ఇక, మిగిలిన స్థానాల్లో వైసీపీ ? 450, టీడీపీ ? 118, బీజేపీ ? 06, జనసేన ? 02, సీపీఎం 03, సీపీఐ 02, ఇతరులు 28 స్థానాలను గెలుచుకున్నారు. ఇక.. జెడ్పీటీసీల విషయానికొస్తే.. 39 స్థానాలకు గాను 36 చోట్ల ఎన్నికలు జరిగాయి. వాటిలో 34 సీట్లతో వైసీపీ దాదాపు క్లీన్ స్వీప్ చేసింది. టీడీపీ, సీపీఎం చెరో ఒక్క జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఇక, ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. గెలిచిన అభ్యర్థులు ఉత్సాహంగా ఉన్నారు. ఈనెల 25న జెడ్పీ చైర్మన్ల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, ఇప్పుడు జెడ్పీ పీఠంపై ఎక్కేందుకు ఏజెన్సీలోని గిరిజన అభ్యర్థులు ఆశావహులుగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే జీకే వీధి నుంచి గెలుపొందిన ఎస్టీ భగత సామాజిక వర్గానికి చెందిన శివరత్నం పేరు ఖరారైందని ప్రచారం జరుగుతోంది. అయితే, ముంచంగిపుట్టు నుంచి గెలుపొందిన సుభద్ర పేరు కూడా చర్చలోకి వచ్చినట్లు సమాచారం. ఇక, ఈ రేసులో మూడో పేరు వెంకటలక్ష్మి. ఈమె జి మాడుగుల నుంచి గెలుపొందారు. వీరితో పాటు మరికొందరు అశావాహులు జెడ్పీ పీఠం కోసం అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ముగ్గురి పేర్లున్నా.. జీకే వీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం పేరు చైర్ పర్సన్ పీఠానికి ప్రధానంగా వినిపిస్తోంది. శివరత్నం భర్త విశ్వేశ్వరరాజు పాడేరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కూడా ఆశించారు. అయితే, ఆ సమయంలో సమీకరణల్లో భాగంగా ఎమ్మెల్యే టికెట్ భాగ్యలక్ష్మీకి దక్కింది. ఆమె అక్కడ గెలుపొందారు. అయితే.. తీవ్ర అసంతృప్తితో ఉన్న విశ్వేశ్వరరాజును అధిష్టానం న్యాయం చేస్తానని అప్పట్లో భరోసా ఇవ్వడంతో ఆయన మెత్తబడ్డారు. ఆ తరువాత జెడ్పీటీసీ ఎన్నికల్లో జీకే వీధి నుంచి భార్య శివరత్నంను పోటీ చేయించారు. అక్కడ ఆమె గెలుపొందారు. అయితే అధిష్టానం తమకు జెడ్పీ చైర్ పర్సన్ పీఠం ఇస్తుందని ధీమాతో ఉన్నారు. ఇక మాజీ మంత్రి బాలరాజు కూడా తన కుమార్తె వెంకటలక్ష్మికి ఎమ్మెల్యే టికెట్ ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పుడు ఆ ఎన్నికలకు దూరంగా ఉన్నా.. పార్టీ పెద్దలతో ఆయన టచ్‌లోనే ఉన్నారు. ఈ నేపధ్యంలో జెడ్పీటీసీ ఎన్నికల్లో జి మాడుగుల టికెట్ ను మాజీమంత్రి బాలరాజు కుమార్తె వెంకటలక్ష్మికి కేటాయించారు. ఈ నేపథ్యంలో ఎలాగైనా జెడ్పీ పీఠంపై తన కుమార్తెను కూర్చోబెట్టాలని మాజీ మంత్రి బాలరాజు విశ్వప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కిముడు శివరత్నం భర్త విశ్వేశ్వరరాజు, మాజీ మంత్రి బాలరాజు దూరంగా ఉన్నారని, వారికి టికెట్ ఇవ్వడంపైనా స్థానిక ఎమ్మెల్యేలు అభ్యంతరం చెప్పినా అధిష్టానం శివరత్నం, వెంకటలక్ష్మికి టికెట్ ఇచ్చారు. తాజా ఫలితాల్లో వాళ్లిద్దరూ గెలిచారు. అయితే.. వీరిలో కిముడు శివరత్నంకే జెడ్పీ చైర్ పర్సన్ పీఠం దాదాపు ఖరారైందని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యేలు.. ప్రత్యామ్నాయ పేరు తెరపైకి తెచ్చినట్టు చెబుతున్నారు. ముంచంగిపుట్టు జెడ్పీటీసీగా గెలుపొందిన సుభద్ర పేరు తెరపైకి వచ్చింది. మరోవైపు బాలరాజు కూడా తన కుమార్తె కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే.. దాదాపుగా ఖరారైందని చెబుతున్న, విశ్వేశ్వరరాజు భార్య శివరత్నం వైపే అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. మరి అదే జరుగుతుందా..? మాజీ మంత్రి బాలరాజు ప్రయత్నం ఫలిస్తుందా..? లేక స్థానిక ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు సఫలీకృతమవుతాయా అన్న సందేహాలకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. అటు కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎవరికి అనే దానిపైనా ఉత్కంఠ నడుస్తోంది. కొలిమిగుండ్ల నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ళిజూబిఞ ఎర్రబోతుల వెంకటరెడ్డి కి చైర్మన్ పదవి ఖరారు చేసింది వైసీపీ అధిష్టానం. గెలిచిన కొద్ది రోజులకే కరోనాతో మృతి చెందారు వెంకట్ రెడ్డి. దీంతో చైర్మన్ పదవి ఎవరికి ఇవ్వాలనే దానిపై సస్పెన్స్ నడుస్తోంది. సంజామల ళిజూబిఞ వెంకటసుబ్బారెడ్డికి చైర్మన్ పదవి వరించే అవకాశం కనిపిస్తోంది. కొలిమిగుండ్ల నుంచి ళిజూబిఞ ఉప ఎన్నికల్లో వెంకట్ రెడ్డి కొడుకు గెలిచిన తర్వాత ఈ చైర్మన్ పదవి కట్టబెడ్తారని అంటున్నారు స్థానిక వైసీపీ నాయకులుఇక, పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించడంతో అనంతపురం జిల్లా పార్టీలో ఉత్సాహం పొంగిపొర్లుతోంది. జెడ్పీ చైర్మన్ ఎవరన్న దానిపై ఉత్కంఠ చెలరేగుతోంది. ప్రధానంగా ముగ్గురు మహిళల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. దీంతో ఈ పంచాయితీ అధిష్టానం దగ్గరకు చేరింది. ఇద్దరు వైస్ చైర్మన్ల ఎంపిక పై కూడా సస్పెన్స్ కొనసాగుతోంది.

# మంత్రికి సమస్యల చిట్టా

విజయవాడ, సెప్టెంబర్ 20, (న్యూస్ పల్స్)ఏపీ ప్రభుత్వ ప్రతినిధులతో సినీ ప్రముఖులు భేటీ అయ్యారుకరోనా సమయం నుంచి థియేటర్ టికెట్ల ధరలు, బెనిఫిట్ షోలు, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ రంగం ఇలా సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురానున్నారు సినీ ప్రముఖులు. అంతేకాదు ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై చిరంజీవి బృందం కొన్ని సూచనలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మీటింగులో నిర్మాతలు అల్లు అరవింద్, దగ్గుబాటి సురేష్ బాబు, దిల్ రాజుతోపాటు మరికొంత మంది సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. కరోనా కారణంగా గత రెండేళ్లుగా ఎక్కువగా సినిమా థియేటర్లు సరిగ్గా నడవడం లేదు? దీంతో ఎగ్జిబిటర్లు నష్టాల్లో కూరుకుపోయారు. అదే సమయంలో ప్రభుత్వం టిక్కెట్ రేట్లను తగ్గించడంతో థియేటర్లకు వచ్చే ఆదాయం సగానికి సగం పడిపోతోందని ఇది.. ప్రధానమైన సమస్యగా మారింది.. ఇదే అంశాన్ని మంత్రికి సినీ ప్రముఖులు వివరించనున్నారు. అంతేకాదు ఈ సందర్భంగా లాక్‌డౌన్ వల్ల సినీ, థియేటర్ కార్మికులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వానికి వివరించనున్నారు. అలాగే బీ, సీ సెంటర్లలో టికెట్ ధరలు, విద్యుత్ టారిఫ్‌ల గురించి కూడా చర్చించనున్నారు. ఇటీవల ఏపీలో జారీ జీవో, చిన్న నిర్మాతల సమస్యలు గురించి ఈ భేటీలో మాట్లాడారు. గ్రామ పంచాయితీ, నగర పంచాయితీ, కార్పొరేషన్ ఏరియాల్లోని థియేటర్ల టిక్కెట్టు ధరలు, చిన్న సినిమాల మనుగడ కోసం 5 షోలకు అనుమతివ్వాలని ప్రభుతాన్ని కోరినట్లు తెలుస్తోంది. విశాఖలో సినీ పరిశ్రమ విస్తరణ తదితర అంశాలపై కూడా ఈ సమావేశంలో సినిమా టిక్కెట్లను ప్రభుత్వమే అమ్ముతుందని ఇటీవల చేసిన ప్రకటనపై చర్చించారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో టికెట్లు అమ్మే అంశంపై అభిప్రాయాలు, సలహాలు తీసుకోనున్నది. ఆన్‌లైన్ టికెట్ల అమ్మకం సొమ్మును రియల్ టైమ్‌లో ట్రాన్స్‌ఫర్ చేస్తామని స్పష్టం చేయనుంది ప్రభుత్వం. ఏపీ ఎఫ్డీసీ ద్వారా ఆన్ లైన్ టికెటింగ్ పోర్టల్‌ను నిర్వహించనున్నట్లు సినిమా నిర్మాతలకు ప్రభుత్వం వివరించనుంది. ఇప్పటికే నిర్మాతలు, సినీ ప్రముఖులు థియేటర్ యాజమాన్యాలతో సంప్రదింపులు జరపనుంది ప్రభుత్వం. ఏపీ స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టిక్కెట్ల విక్రయం చేపట్టనుంది సర్కార్. దీనికి సంబంధించిన బ్లూప్రింట్, అమలు వ్యవహారాన్ని పరిశీలించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి హోం శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్ గా ఉంటారుఇసుక కూడా అమ్మలేక ప్రైవేటుకి కాంట్రాక్టు ఇచ్చేసిన ప్రభుత్వం సినిమా టిక్కెట్లు అమ్ముతుందా? అని విమర్శలు తలెత్తున్న నేపథ్యంలో మంత్రి పేర్ని నాని స్పందించారు. పారదర్శకత కోసమే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. థియేటర్ల, ఎగ్జిబిటర్ల అక్రమాలకు కళ్లెం వేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. థియేటర్ల మెయింటెనెన్స్ కు నెలకు సుమారు మూడు, నాలుగు లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఆదాయం మాత్రం యాభై వేలే చూపిస్తున్నారని థియేటర్ల యజమానులపై ఆరోపణ తలెత్తుతున్నాయి. అంతేకాదు సినిమాలను బయ్యర్లకు అమ్మినప్పుడు వచ్చే మొత్తం తప్పితే, సినిమా ఎంత విజయాన్ని సాధించినా, ఎగ్జిబిటర్స్ నుండి రూపాయి కూడా వెనక్కి రావడం లేదన్నది నిర్మాతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ.పి. ప్రభుత్వం సినిమా టిక్కెట్ల ఆన్ లైన్ అమ్మకాల వార్త రాగానే విమర్శల పర్వం మొదలైంది. టిక్కెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెట్టుబడిగా చూపించి.. ప్రభుత్వం అప్పులు చేయబోతోందనే కొన్ని మీడియాలో ఆరోపణలు వినిపించాయి. అంతేకాదు టిక్కెట్ అమ్మకాల ద్వారా వచ్చే మొత్తాన్ని ప్రభుత్వం వాడేసుకుంటుందని.. ఎగ్జిబిటర్స్ కు వెంటనే ఇవ్వదని, దానికి కోసం వాళ్ళు ప్రైవేట్ కాంట్రాక్టర్ల మాదిరి ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొట్లాల్సి ఉంటుందని మరో వాదన కూడా తెరపైకి వచ్చింది. అయితే ఈ విషయమై పేర్ని నాని స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఆన్ లైన్ ద్వారా జరిగిన అమ్మకాల మొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పన్నులను, ఎగ్జిబిటర్స్ కు చెందాల్సిన మొత్తాన్ని వారి వారి ఖాతాలో మర్నాడు ఉదయమే జమ చేసే విధానాన్ని అవలంబిస్తామని మంత్రి పేర్ని నాని తెలిపారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే రోజా స్పందిస్తూ.. అసలు సినిమా టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విక్రయించేలా చూడాలని చిరంజీవి, నాగార్జునే కోరినట్లు చెప్పారు. జూన్‌లో ఒకసారి తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు జగన్‌తో భేటీ అయ్యారు. నాడు సీఎంను కలిసినవారిలో చిరంజీవి, నాగార్జున, రాజమౌళి, సురేశ్‌బాబు, సి. కల్యాణ్, దిల్ రాజుమరి సీఎం జగన్ తో ఈసారి జరిపే చర్చల్లో ఎలాంటి సమస్యలు పరిష్కారమౌతాయో చూడాలి మరి. కరోనా కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఇండస్ట్రీని రెండు ప్రభుత్వాలు ఆదుకోవాలని మెగాస్టార్ చిరంజీవి విజ్ఞప్తి చేశారు.

# బీసీలు బ్యాక్వర్డ్ నుంచి బ్యాక్ బోన్ గా ఎదగాలి.

## బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు

నెల్లూరు సెప్టెంబర్ 19, (న్యూస్ పల్స్) బీసీలు బ్యాక్వర్డ్ క్లాస్ నుంచి బ్యాక్ బోన్ గా ఎదగాలని ఉందని బీసీ వెల్ఫేర్ జేఏసి రాష్ట్ర అధ్యక్షులు పేర్కొన్నారు. స్థానిక రాదే గెస్ట్ ఇన్ లో బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాలకు చెందిన వారందరినీ వెనుకబడిన తరగతులకు చెందినవారిగా గా ప్రభుత్వం మరియు సమాజం గుర్తించబడిందన్నారు. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా వెనుకబడిన తరగతుల నుంచి వెన్నెముకలాగా నిలబడాల్సి ఉందన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా బీసీల అభివృద్ధికి బీసీ వర్గాల లోనే కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఐక్యతగా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు బీసీ వెల్ఫేర్ జేఏసీలో 60 కోట్లకు పైగా ఐక్యమై సభ్యత్వం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 139 బిసి కులాలు బీసీ వెల్ఫేర్ జేఏసీ చేర్చేందుకు కు తమ వంతు కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో చట్టసభల్లో బీసీలకు రాజకీయ అవకాశం కలిగించిన పార్టీలకే మద్దతు ఇచ్చేందుకు బీసీల ఐక్యత చాటుకోవాలని కోరారు. బీసీల ఓటు బ్యాంకును రాజకీయంగా వాడుకుంటున్న రాజకీయ నాయకులకు బీసీలు ప్రశ్నార్థకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయం రాష్ట్ర రాజకీయాల్లో భిన్నంగా ఉంటుంది అన్నారు. బీసీల సమస్యల పై బిసి వెల్ఫేర్ ప్రత్యేక దృష్టి సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గా బొమ్మి నాగ కిషోర్ యాదవ్ను, జిల్లా ఇన్చార్జి గా మస్తానమ్మ ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు బొమ్మి నాగ కిషోర్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం అప్పగించిన పదవీ బాధ్యతలను నెరవేరుస్తూ జిల్లాలో బీసీ వెల్ఫేర్ జేఏసీ బలోపేతానికి కృషి చేస్తారని భరోసా ఇచ్చారు. బీసీలు అన్ని రంగాలలో రాణించిన నాడే బీసీలు అభివృద్ధి సంక్షేమ సాధించే అవకాశం ఉంటుందన్నారు. బుద్ధిబలంతోను ఐక్యతను సాధించలేనిది మరేది ఉండదని పేర్కొన్నారు. గత 90 సంవత్సరాలుగా బిసి కులాల జనగణన చేపట్టకపోవడం మే బీసీల అభివృద్ధి సంక్షేమ కుంటుపడిందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో బిసి కులాల ఐక్యత చాటుకునేందుకు తన వంతు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపిక కాబడిన నెల్లూరు జిల్లా అధ్యక్షులు మరియు ఇన్చార్జి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జేఏసీ ముఖ్య సలహాదారు సత్య ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి జగన్ మోహన్ , ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు డాక్టర్ మారం విజయలక్ష్మి , అధికార ప్రతినిధి డాక్టర్ డి మస్తానమ్మ, శాలివాహన సంఘం అధ్యక్షులు ధనలక్ష్మి, జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు టీ పద్మజ, ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రావు, బొమ్మి రాదయ్య, సురేంద్ర, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికైన సభ్యులకు 24 న ప్రమాణ స్వీకారం

## -ఎంపీడీఓ

బేతంచెర్ల సెప్టెంబర్ 19, (న్యూస్ పల్స్)మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన 15 మండల ప్రజా పరిషత్ సభ్యులకు ఈ నెల 24 వ తేదీన ప్రమాణ స్వీకారం ఉంటుందని, కావున ఎన్నికైన సభ్యులు మాత్రమే ఎంపీడీఓ కార్యాలయానికి హాజరవ్వాలని ఎంపీడీఓ అశ్విన్ కుమార్, ప్రొసీడింగ్ అధికారి రమణ మూర్తి సోమవారం పత్రికా ప్రకటన లో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదే రోజు మండలాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నిక ఉంటుందని, అందుకు సంబంధించిన ముసాయిదాను కూడా సిద్ధం చేశామని, వీరి ఎన్నిక తరువాత కో అప్షన్ సభ్యుని ఎన్నిక కూడా ఉంటుందని, ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చే సమావేశాలకు కోరం పాటించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసుల, తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ : బీబీ పాటిల్

జహీరాబాద్ : మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఈరన్నవాగు చెరువులో చేపపిల్లలను వదిలి , అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై జిల్లాలో 1350 చెరువుల్లో 4.83 కోట్లు చేప పిల్లలు వదులుతున్నదన్నారు. చెరువుల్లోని చేపలను పట్టి సంతలు, మార్కెట్లలో విక్రయించేందుకు మత్స్యకారులకు ప్రభుత్వం మోపెడ్‌లను పంపిణీ చేసిందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఉన్న 99 చెరువుల్లో 37.97 లక్షల చేప పిల్లలను పెంచేందుకు



రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మాణిక్‌రావు తెలిపారు. ప్రతి మత్స్యకారుడికి సహకార సంఘంలో సభ్యత్వం ఇచ్చి, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో మత్స్యకారుల సహకార సంఘాలకు సామూహిక భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో నీటివనరులు ఉన్న చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ ఏడి సతీశ్, సహాయ అధికారి శ్రీశైలం, జహీరాబాద్ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆత్మకమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎంజీ. రాములు, టీఆర్ఎస్ నాయకులు జి. గుండప్ప, సుభాశ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో రాములు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ బస్సు? విద్యార్థి మృతి మరొక విద్యార్థికి తీవ్రగాయాలు

తిరుపతి ద్విచక్ర వాహనాన్ని ఒక ప్రైవేట్ బస్సు ఢికొన్న ప్రమాదంలో ఒక విద్యార్థి మృతిచెందాడు. మరొక విద్యార్థికి తీవ్రగాయాలు అయ్యాయి. తిరుపతి.... చంద్రగిరి రహదారిలోని కాలూరు క్రాస్ వద్ద ఘటన జరిగింది. మృతుడు తన పల్లి పంచాయతీ వేమూరు కు చెందిన మణి కుమారుడు వి.హర్షవర్ధన్ గా గుర్తించారు. ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు వ్రాసి వెళుతుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన మరో విద్యార్థి కడప జిల్లా ,ప్రకాష్ నగర్ కు చెందిన వెంకటరమణారెడ్డి ని108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఎంఆర్ పల్లి ఎస్సై వినోద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

**5 వ రోజు రిలే దీక్షలు ప్రారంభించిన, మాజీ మంత్రి ,యమ్ యల్ సీయన్ యమ్ డి ఫరూక్**

నంద్యాల సెప్టెంబర్ 20, (( విభారె) )"నంద్యాల పట్టణంలో సోమవారం లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా 5 వ రోజు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో కూర్చున్న వారు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చింతల మోహన్ రావు, కాంగ్రెస్ జిల్లా కోశాధికారి యస్ వై డి , ప్రసాద్ కాంగ్రెస్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, మైనార్టీ నాయకుడు కాశిమ్ , బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు రవి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు అజయ్ ,సాయి కూర్చుండం జరిగింది .ఈ దీక్షలకు అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చింతలయ్యా అధ్యక్షత వహించారు. ఈ దీక్షలకు ప్రారంభంగా మాజీ మంత్రి ,యమ్ యల్ సీ ,తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు ఫరూక్. ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ,యమ్ యల్ సీ ,తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు ఫరూక్,లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర మౌలానా ముస్తాక్ అహ్మద్ ,పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చింతల మోహన్ రావు,ఆవాజ్ జిల్లా కన్వీనర్ మస్తాన్ వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును చూస్తే ఎంతో బాధ వేస్తుందని ప్రజల మీద అనవసరమైన భారాలు మోపుతూ చెత్త పన్ను విద్యుత్ ఛార్జీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ బిల్లు రద్దు చేయాలని గ్యాస్ డీజిల్ పెట్రోల్ రేట్లు జీఎస్టీ పరిధిలోకి తీసుకోవాలని ఇంటి చెత్త కుళాయి మురికి కాలువల పన్ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈరోజు ఆలోచించుకోవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది ఈ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి గారు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల కర్షకులు కార్మికులు సాధారణ పౌరులు మొత్తం కూడా విపత్కర పరిస్థితుల్లి ఎదుర్కొంటున్నారు మరి ఈ రోజు కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న గ్యాస్ డీజిల్ పెట్రోల్ మీద కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఎటువంటి అదుపు లేకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఆంధ్ర ప్రజల మీద విరమించుకోవాలని దీక్ష సందర్భంగా తెలియజేయడం జరుగుతుంది . కాంగ్రెస్ పార్టీ వామపక్ష పార్టీలు ప్రజాసంఘాలు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక లో డిమాండ్ చేశారు. అబద్ధాల హామీలు కేంద్రంలో నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగన్ మోహన్ రెడ్డి ఒక్కటేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు కావలసింది ఉపాధి కావాలంటే ఆంధ్రప్రదేశ్ లో పరిశ్రమల ఏర్పాటు చేయాలి నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలి పథకాలు ఇవ్వడం వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుకు రాదని మండిపడ్డారు.విద్యుత్ వ్యవసాయ బిల్లును రద్దు చేయాలి వారు డిమాండ్ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ దీక్షలకు మద్దతు ఇచ్చిన వారు పిడిఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి రఫీ, జిల్లా కార్యదర్శి సలాం మౌలానా, జాను జాగో జాతీయ కార్యదర్శి మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## 24 వ తేదీన దేశ సార్వత్రిక సమ్మెకు అంగన్వాడీ వర్కర్స్ పూర్తి మద్దతు

డోన్ సెప్టెంబర్ 20, (( విభారె) )24 వ తేదీన సార్వత్రిక సమ్మె కు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్అంగన్వాడీ వర్కర్సుయిండ్ హెల్పర్స్ అసోసియేషన్ డోన్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాందిని తెలిపారు, స్థానిక డోన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ ,మరియు హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు వచ్చినప్పుడు ఆ వర్కర్లకు,అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ లను బాగా ఉపయోగించు కొని ,ఐకాయాలు తగినంత పారితోషికం ఇవ్వకుండా ఉండడం దారుణం అని ఆమె అన్నారు, అలాగే అంగన్వాడీ వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగ భద్రత,పి యఫ్, ఈయస్ ఐ, పెన్షన్ ఇవ్వాలని, అలాగే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవ వేతనాలను అంగన్వాడీ వర్కర్స్ 1500/-,హెల్పర్స్ 750/- రూపాయలను పెంచిన ఇంతవరకూ అమలుకు నోచుకోలేదు అని,అందుకే 24 వ తేదీన దేశ సార్వత్రిక సమ్మెకు మద్దతుగా అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం, అందుకే ముందుగా ఐసీడీఎస్ అధికారిని కలిసి వినతిపత్రం అందజేడం జరిగింది, ఈ కార్యక్రమంలో సువర్ణ,ఎస్తేరు, తదితరులు అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు

# మహానంది క్షేత్రంలో అధికారిక దిద్దుబాటు

కర్నూలు సెప్టెంబర్ 20, (( విభారె) )మహానంది క్షేత్రంలో అధికారిక దిద్దుబాటు చర్యలను నేడు చేపట్టినట్టు విశ్వసనీయ సమాచారం.గత యేడాది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు తమకు తోచినంత ఆర్థిక సహాయ సహకారాలను అందజేశారు.కానీ వీటికి రసీదు అధికారికంగా కొంత మంది దాతలకు అందజేసిన మరికొంత మంది దాతలకు అందజేయాల్సి ఉన్నా వారికి నిన్నటి వరకు అంద చేయలేదని ఆరోపణలు వినవస్తున్నాయి.నేడు హడావిడిగా దాతలు అందజేసిన సొమ్ము కు సంబంధించి ఒక లక్ష రూపాయలు ఒక రసీదు మరో రెండున్నర లక్షల రూపాయలకు సంబంధించిన మరో రసీదు నేడు హడావిడిగా దాతలకు అందజేయడానికి సిద్ధం చేసినట్లు తెలిసింది.ప్రతి దసరా ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలను మహానంది క్షేత్రంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.అందుకు భక్తులు మరియు దాతలు పన్నెండు వేల ఐదు వందల 116 రూపాయలు పూజా కార్యక్రమానికి విరాళంగా అందజేస్తున్నారు.గుంపులో గోవిందా అదేవిధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి దాతలు ఇచ్చే సొమ్ము నకు రసీదులు కొంత మందికి మాత్రమే ఇచ్చి మిగతా వారికి ఇవ్వడం లేదని విమర్శలు వినవస్తున్నాయి.దాతల సొమ్ము ఏమవుతుందో ఎవరి ఖాతాలో పడుతుందో తెలియడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.నేడు రెండు పాత రసీదులతో మూడు లక్షల 50 వేల రూపాయలు దాతలు చెల్లించినట్లు రసీదులు ఇచ్చారని ప్రచారం చర్చనీయాంశంగా మారింది.దాతలు ఎప్పుడు విరాళాలను అందజేశారు వాటి వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు కావడం లేదని ఆరోపణలు,విమర్శలు లేదా దాతలు ఒత్తిడి చేసినప్పుడు మాత్రమే రసీదులు పుట్టుకొస్తున్న టు తెలుస్తుంది.ఏది ఏమైనా దాతలు ఇచ్చే సొమ్మును భద్రంగా రికార్డుల్లో నమోదు చేయలేని వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.కొసమెరుపు...ఆ మహానందీశ్వరుడు ఎప్పుడు కళ్లు తెరుస్తాడో అంత వరకు ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయి.రక్షణ కల్పించాల్సిన ఈ.ఓ నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం ఈ అపవాదంకు బలం చేకూరుస్తుంది.

# విఘ్నేశ్వరుని ఈ అవతారాలను పూజిస్తే.. విఘ్నాలన్నీ తొలగిపోతాయట...!



హిందూ పురాణాల ప్రకారం విఘ్నేశ్వరుడు అంటే కేవలం విఘ్నాలు తొలగించడమే కాదు.. తన రూపు, స్వభావం వెనుక లోతైన అర్థం ఉందని పండితులు చెబుతుంటారు. బెస్ట్ ఎస్‌యూవీని సొంతం చేసుకునేందుకువినాయకుని ఆరాధనతో ఎలాంటి కష్టాల నుంచైనా గట్టెక్కొచ్చని చాలా మంది నమ్మకం. అందుకే అందరూ ఏ పూజ చేసినా ముందు గణపతి పూజతో ప్రారంభిస్తారు. వినాయకుని ఆరాధించడంలోనూ ఆధ్యాత్మిక విషయాలు ఎన్నో దాగి ఉన్నాయి. అందుకే నిదర్శనమే వినాయకుని అవతరాలు. వినాయకుడు కూడా విష్ణుమూర్తి మాదిరిగా కొన్ని అవతారాల్లో అవతరించాడు. ఆయా సందర్భాల్లో భక్తులను రక్షించేందుకు విఘ్నేశ్వరుడు దాదాపు ఎనిమిది అవతారాలు ఎత్తినట్లు ముద్గల పురాణం చెబుతోంది. ఈ అవతారాలల మాత్సర్యాసురుడు, మదాసురుడు, మోహాసురుడు, లోభాసురుడు అనే రాక్షసులని జయించేందుకు వక్రతుండుడు, ఏకదంతుడు, మహోదరుడు, గజాననుడు, లంబోదరుడు, వికటుడు, విఘ్నరాజు, ధుమ్రావర్ణుడు అనే అవతారాలను ఎత్తాడు. ఈ సందర్భంగా ఆ అవతారాల విశేషాలంటో ఇప్పుడు తెలుసుకుందాం. :మీ రాశిని బట్టి వినాయకుని ఇలా పూజిస్తే.. ఆటంకాలన్నీ తొలగిపోతాయట...! ఏకదంతుడు.. ఏకదంతుడు.. పురాణాల ప్రకారం.. చ్యవనుడనే రుషి మదాసురుడనే రాక్షసుడిని సృష్టించాడు. రాక్షసుల గురువు శుక్రాచార్యుడు తనకు 'హ్రీం' అనే మంత్రాన్ని ఉపదేశించి దాన్ని నిరంతరం జపిస్తే కచ్చితంగా ఫలితం దక్కుతుందని చెబుతారు. దీంతో లోకాన్ని జయించాలనే ఆశతో మదాసురుడు హ్రీంకారాన్ని కొన్ని యుగాల పాటు జపించాడు. దీంతో అతను కోరుకున్న శక్తులన్నీ లభించాయి. దీంతో దేవతలంతా భయపడిపోయారు. అప్పుడు వారు సనత్ కుమారుని వద్దకు ఏదైనా ఉపాయం చెప్పమని కోరగా.. అప్పుడు సనత్ కుమారుని సూచన మేరకు.. వినాయకుడని ప్రార్థించగా అప్పుడు గణపతి 'ఏకదంతు'నిగా అవతరించి మదాసురుడిని జయించాడు. ఇక్కడ మదాసురుడు అంటే గర్వానికి చిహ్నం. ఏకదంతుడు ఈ లోకం యావత్తు ఒక్కటే అన్న అద్వైతానికి చిహ్నం. ఆ రహస్యం తెలిసిన రోజున మదం అణిగిపోక తప్పదు. వక్రతుండుడు.. వక్రతుండుడు.. పూర్వ కాలంలో ఇంద్రుడు చేసిన ఓ తప్పు వల్ల 'మాత్సర్యాసురుడు' అనే రాక్షసుడు పుడతాడు. అతని దెబ్బకు ముల్లోకాలన్నీ ఇబ్బందులు పడ్డాయి. అతన్ని ఎదుర్కొనేందుకు ఎలాంటి ఉపాయం తోచక దేవతలంతా దత్తాత్రేయుని శరణు కోరారు. అప్పుడు దత్తాత్రేయుడు విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడిని ప్రార్థించమని కోరారు. అప్పుడు 'గం' అనే బీజాక్షరంతో దేవతలంతా ఆ గణపతి గురించి తపస్సు చేయగానే 'వక్రతుండుని'గా వినాయకుడు అవతరించాడు. మాత్సర్యాసురుడు అనే రాక్షసుడిని అంతమొందించాడు. వక్రతుండాన్ని ఓంకారానికి ప్రతీకగా భావిస్తారు. గజాననుడు.. గజాననుడు.. కుబేరుడి ఆశ నుండి లోభాసురుడు అనే రాక్షసుడు ఉద్భవించాడు. ఇతను పరమేశ్వరుని అనుగ్రహంతో ముల్లోకాలను శాసించే వరాన్ని పొందాడు. కానీ ఇతని లోభానికి హద్దు అదుపు లేకుండా పయింది. చివరికి ఆ భోళా శంకరుని కైలాసాన్ని సైతం తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఆశపడతాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న దేవతలు రైభ్యుడనే రుషిని శరణు కోరగా.. తను వినాయకుడిని పూజిస్తే.. లోభాసురుడి నుండి మీకు విముక్తి లభిస్తుందని చెబుతాడు. దీంతో సకలదేవతలందరూ గణేశుడిని ప్రార్థించగా.. వారి ప్రార్ధనను మన్నించి 'గజాననుడి'గా అవతరించి లోభాసురుడిని ఓడిస్తాడు. గజాననుడు అంటే ఏనుగు శిరస్సు కలిగినవాడు. ఏనుగు తల బుద్ధిని సూచిస్తుంది. :వినాయక చవితి రోజున చంద్రుడిని ఎందుకు చూడకూడదంటే... మహోదరుడు.. మహోదరుడు.. పరమేశ్వరుడు ఓ సారి తపస్సులో నిమగ్నమైపోయాడు. ఎంతసేపటికీ తాను తపస్సు నుండి బయటకు రాకపోవడంతో.. పార్వతీదేవి కంగారు పడిపోయింది. అప్పుడు శివుని తపస్సుకు భంగం కలిగించాలని నిర్ణయించుకుంది. అప్పుడు ఓ గిరిజన యువతిగా మారి ఆయనకు తపోభంగం చేసేందుకు ప్రయత్నించిది. తను చేసిన పొరపాటుకు మోహాసురుడు అనే రాక్షసుడు జన్మించాడు. తను సూర్యుడిని ఆరాధించి ముల్లోకాలపై ఆధిపత్యం సాధించాడు. దీంతో తన ఆగడాలను అడ్డుకునేందుకు వినాయకుడు మహోదరుడిగా అవతరించి.. తనను అంతమొందిస్తాడు.. విఘ్న రాజు..శంబరుడు అనే రాక్షసుని ప్రలోభంతో మమతాసురుడు ముల్లోకాలను పీడించగా.. దేవతలంతా వినాయకుని ప్రార్థిస్తారు. అప్పుడు విఘ్నరాజు అవతారంలో నాగపాముని వాహనం చేసుకుని మమతాసురుడిని మట్టుబెట్టినట్టు పురాణాలు చెబుతున్నాయి.

వికటుడు.. వికటుడు.. ఈ అవతారంలో కామాసురుడనే రాక్షసుడిని వధించాడు. ఇతను ఘోర తపస్సు చేసి.. పరమేశ్వరుని అనుగ్రహం పొందుతాడు. అప్పటి నుండి ముల్లోకాలపై ఆధిపత్యం చెలాయిస్తాడు. దీంతో ఇతని బారి నుండి కాపాడుకునేందుకు దేవతలంతా వెళ్లి వినాయకుడిని వేడుకొనగా.. తను వికటుని ప్రత్యక్షమై కామాసురుడిని అంతమొందిస్తాడు. లంబోదరుడు.. లంబోదరుడు.. ఈ అవతారంలో క్రోదాసురుడు అనే రాక్షసుడిని మట్టుబెట్టాడు. క్రోదం ఎల్లప్పుడూ తాను ఇష్టపడిన(ప్రీతి) దాని కోసం ఏదైనా చేసేందుకు సిద్ధమవుతుంది. అదే సమయంలో విజయం సాధిస్తే సంతోషం.. ఓడితే ఉద్వేగాలు కలుగుతూ ఉంటాయి. దూమ్రావర్ణుడు.. దూమ్రావర్ణుడు.. ఈ అవతారంలో వినాయకుడు అహంకరాసురుడిని చంపినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ రాక్షసుడి పాలనతో విసుగు చెందిన దేవతలందరూ మోక్షం కోసం వినాయకుడిని ధ్యానించారు, ఆపై వారిని ఊదా రూపంలో కాపాడటానికి భగవంతుడు అవతరించాడు. ఎలుక కూడా ఈ అవతారానికి వాహనం.

# 'సైమా 2021'ని ఎరుపెక్కించిన వ్యాటే బ్యూటీ

సైమా 2021 అవార్డుల వేడుకతో హైదరాబాద్ మళ్లీ రంగులమయం అయింది. అన్ని భాషల తారలు అవార్డు ఫంక్షన్లో పాల్గొని వేడుకకు శోభను తీసుకొచ్చారు. ముఖ్యంగా హీరోయిన్లు డిజైనర్ దుస్తుల్లో తళుక్కున మెరవడంతో ఆ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. చాలా కాలానికి ఈ మెరుపులు! అంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి.ఏడాదిన్నరగా కరోనా భయం గుప్పిట్లో బతికిన జనం మనసుల్లో నుంచి ఆ భయం ఇప్పుడిప్పుడే నెమ్మదిగా తొలగిపోతోంది. నిన్న మొన్నటి వరకూ నెటిజనులు కరోనా గురించి మాట్లాడుకున్నారు. ఇప్పుడు సైమా 2021లో పాల్గొన్న అందగత్తెల గురించి మాట్లాడుకోవడం విశేషం. హైదరాబాద్ లో వేడుక కావడంతో దాదాపు టాలీవుడ్ భామలంతా ఈ వేడుకలో పాల్గొన్నారు.తమ గ్లామర్ షోలతో కెమెరాలకు ఫోజులిచ్చి ఆకట్టుకున్నారు. తాజాగా వ్యాటే బ్యూటీ రష్మిక మందన ఎర్రటి డిజైనర్ దుస్తుల్లో తళుక్కున మెరిసింది. ఎర్రటి తివాచీకి మ్యాచింగ్ డ్రెస్ లో వ్యాటే బ్యూటీ వ్వావ్ అనిపించింది. హాఫ్ షోల్డర్ ఎరుపు గౌను లో రష్మిక ప్రత్యేకంగా చూపరులను ఆకర్షించింది. తన గెటప్ కి తగ్గట్టే లైట్ మేకప్ వేసుకుంది. హెయిర్ ని రెండు భాగాలు చేసి కురుల్ని అలా గాలికి వదిలేసింది. ఆ ఎర్రటి తివాచీపై హోయలు పోతూ నవ్వులు ఒలికించింది. ప్రస్తుతం ఆ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అందాలన్ని ఒకే చోట చేసి కుర్రాళ్ల గుండెల్ని చిదిమేస్తున్నారంటూ ఓ నెటిజనుడు కామెంట్ చేసాడు. రష్మిక నవ్వుకు గుండె గుల్లయిపోయిందని వాపోయాడు మరి.ఇక రష్మిక సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ సరసన పుష్పలో నటిస్తోంది. రెండు భాగాలు గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మొదటి భాగం 'పుష్ప: ది రైజింగ్' టైటిల్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పాన్ ఇండియా చిత్రంగా రిలీజ్ అవుతుంది. ఇందులో రష్మిక గిరిజన యువతి పాత్రలో కనిపించనుంది. అలాగే బాలీవుడ్ లో అమ్మడు 'మిషన్ మజ్ను' సినిమాతో లాంచ్ అవుతుంది. ఇందులో సిద్దార్థ్ మల్హోత్రాతో రొమాన్స్ చేస్తుంది. అమితాబ్ తో గుడ్ బాయ్ లోనూ నటించింది. భవిష్యత్ ని కూడా అక్కడే ప్లాన్ చేసుకుంటున్నట్లు సమాచారం.ఇక ఇటీవల వరుసగా హిందీ చిత్రాలతో బిజీ అయిపోయిన రష్మిక మందన ముంబైలోని ఒక ఇంటిని సొంతం చేసుకోవాలనుకుంది. ఈ బ్యూటీ హిందీ కమిట్ మెంట్ల వల్ల ఓ అపార్ట్ మెంట్ లో తొలిగా అద్దెకు వెళ్లింది. కానీ అలా ఉండడం తనకు నచ్చడం లేదు. అందుకే రష్మిక ఇటీవల ముంబైలో ఇల్లు కొనుక్కుంది. దీనివల్ల స్టార్ హోటల్లో బస చేయాల్సిన అవసరం తప్పింది మరి.రష్మిక ఒక్కో సినిమాకి 4 కోట్ల మేర పారితోషికం డిమాండ్ చేస్తోందని సమాచారం. ఇప్పటికిప్పుడు పుష్ప డ్యూయాలజీతో పాటు శర్వానంద్ తదితరులతో సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ భారీ గా పారితోషికాలు అందుకుంటోంది. అటు హిందీ చిత్రాలకు 4 కోట్లు మించి పారితోషికం ఆఫర్ చేసినట్టు ఇంతకుముందు కథనాలొచ్చాయి. కన్నడ నటుడు రక్షిత్ తో నిశ్చితార్థం క్యాన్సిల్ చేసుకుని ఇప్పుడిలా కథానాయికగా నాలుగు చేతులా ఆర్జిస్తోందని గుసగుసలు వినిపిస్తున్నాయి.




# సప్తగిరి 'గూడుపుఠాణి' ట్రైలర్ ఆసక్తికంగా ఉంది : మారుతి



ఎస్ఆర్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో సప్తగిరి నేహా సోలంకి జంటగా కె.యమ్. కుమార్ దర్శకత్వంలో రియల్ ఎస్టేట్ కింగ్స్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి కటారి రమేష్ నిర్మిస్తున్న చిత్రం "గూడుపుఠాణి " అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రే రేలీజ్ ఈవెంట్ కార్యక్రమం సినీ అతిరదుల సమక్షంలో ఘనంగా జరూపుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా వచ్చిన సినీమాటోగ్రాఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శకుడు మారుతిస్పీకర్ రాంభూపాల్ ఆదోని ఎం.ఎల్.ఏ క్రాంతి కుమార్ అల్లీన్నా డెవలపర్ రంగారెడ్డి డైరెక్టర్ మున్నా ధనరాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వచ్చిన×మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ× .. ఈ మధ్య నేను సినిమా ఫంక్షన్ లకు అటెండ్ కాలేదు కానీ తమ్ముడు సప్తగిరి ఫిలిచిన వెంటనే నేను ఈ ఫంక్షన్ కు రావడం జరిగింది. ఎందుకంటే తెలుగు చిత్ర రంగంలో చాలా మంది సినీ వారసులుగా ఇండస్ట్రీలో కి ఎంటర్ అయ్యారు.. కానీ ఒక మాములు వ్యక్తి ఏ బ్యా గ్రౌండ్ లేకుండా తన టాలెంట్ తో హీరో స్థాయికి చేరుకోవడం చాలా గర్వకారణం.చలన చిత్ర పరిశ్రమకు యంగ్ జనరేషన్ రావాల్సిన అవసరం ఎంతో ఉంది. హీరోగా నాలుగవ చిత్రంలో నటించిన సప్తగిరికి దేవుడు ఆశీర్వాదం తో పాటు ప్రేక్షకుల ఆశీస్సులు ఉండాలి. నిర్మాతలు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి కటారి రమేష్ గార్లు సినిమాను చాలా చక్కగా నిర్మించారుదర్శకుడు కుమార్ గారు మంచి కథను తెరకెక్కించారు.ఇంతకాలం సింగర్ గా ఉన్న రఘుకుంచె గారు ఈ చిత్రంలో విలన్ గా నటించడం విశేషం. ఎంతో కష్టపడి చేసిన వీరందరికీ ఈ సినిమా పెద్ద విజయం సాదించాలని మనస్ఫూర్తిగా కోరుకొంటున్నాను అన్నారు.×ప్రముఖ దర్శకుడు మారుతి మాట్లాడుతూ...× సప్తగిరి చేస్తున్న గూడుపుటాని ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. కొత్త నిర్మాతలు శ్రీనివాస్ రెడ్డి రమేష్ కటారి సినిమాను ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. సప్తగిరి ప్రతి సినిమాను ఇష్టపడి చేస్తాడు తాను భవిషత్తులో చేసే అన్ని సినిమాలు బాగా ఆడాలని కోరుకుంటున్నాను డైరెక్టర్ కుమార్ "గూడుపుఠాణి" సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ప్రతాప్ విద్య సంగీతం బాగుంది. చిత్ర యూనిట్ అందరికీ ఈ సినిమా పెద్ద సక్సెస్ అయ్యి మంచి పేరు తెచ్చిపెట్టాలని కోరుకుంటున్నాను అన్నారు.

# తెలుగు తెరపై రీమేకుల సోకులు!




తెలుగు సినిమా ఓ కథల కర్మాగారం .. గతంలో ఇక్కడ నుంచి అనేక కథలు వివిధ భాషలకు తరలి వెళ్లాయి. తెలుగు కథలు అనేక చిత్రపరిశ్రమలకు అసలైన విజయాలు ఎలా ఉంటాయనే విషయాన్ని చాటి చెప్పాయి. తెలుగులో ఏ సినిమా హిట్ అవుతుందా అని ఇతర భాషల్లోని స్టార్ హీరోలు కాచుకుని కూర్చుని రీమేక్ హక్కుల కోసం పోటీలుపడిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఆ తరువాత పరిస్థితులు మారుతూ వస్తున్నాయి. ఇతర భాషల్లో చెబితేనే కథ .. అక్కడ హిట్ అయితేనే దానికి ఓ విలువ అనే అభిప్రాయం బలపడిపోతోంది. గతంలోను కోడి రామకృష్ణ .. రవిరాజా పినిశెట్టి కొన్ని సినిమాలను తెలుగులో రీమేక్ చేశారు. అవి రీమేక్ అంటే ఇప్పటికీ మనం నమ్మలేం .. అంతగా వాళ్లు కసరత్తు చేసి తెలుగు నేటివిటీకి తగినట్టుగా మార్చడంలో సక్సెస్ అయ్యారు. మన ఊరువాడు అనే ఆలోచన మన మనసులో ఎంత బలంగా ఉంటుందో .. మన కథ అనే భావన కూడా అంతే బలంగా ఉంటుంది. అందువలన కథ ఎప్పుడూ కూడా స్థానికతకు దూరంగా వెళ్లకూడదు. ఈ కథ మనది కాదు అనే ఆలోచన ప్రేక్షకుడికి వస్తే అతను ఆ కథకి కనెక్ట్ కాలేడు. కొన్ని రీమేక్ లు దెబ్బ తినడానికి స్థానికత విషయంలో లోపమే కారణమని బలంగా చెప్పవచ్చు.ఈ కథ మనకి సంబంధించినదే .. ఇందులో హీరో పోరాడేది మన సమస్యను పరిష్కరించడానికే అనే స్థానికతకు సంబంధించిన భావన కలిగించడంలో సక్సెస్ అయిన రీమేక్ లను స్ట్రయిట్ సినిమాల మాదిరిగానే ఇక్కడి ప్రేక్షకులు ఆదరించారు. ఘనవిజయాలను దోసిళ్లలో పెట్టి అందించారు. అలాంటి సినిమాల జాబితాలో 'హిట్లర్' .. ఠాగూర్' .. 'ఖైదీ నెంబర్ 150' .. 'గద్దలకొండ గణేశ్' .. 'వకీల్ సాబ్' సినిమాలు మచ్చుకి కనిపిస్తాయి. వీటిని ఉదాహరణగా చూపిస్తూ మరిన్ని రీమేకులు తెలుగు తెర దిశగా పరుగులు తీస్తూ వస్తున్నాయి.రీమేక్ సినిమాల వలన ఒక సౌలభ్యం ఉంటుంది. కథపై ఒక అవగాహన ఉంటుంది. ఆ పాత్ర తమకి సెట్ అవుతుందో లేదో ముందుగానే తెలిసిపోతుంది. ఎంత బడ్జెట్ అవుతుందో .. ఎన్ని రోజులలో పూర్తి చేయవచ్చుననే విషయాల్లో ఒక క్లారిటీ ఉంటుంది. అందువలన చాలామంది హీరోలు రీమేక్ సినిమాలపై దృష్టిపెడుతున్నారు. అక్కడి కథలను దిగుమతి చేసుకుని ఇక్కడ తయారైన పౌడర్ పూస్తున్నారు. ఈ పౌడర్ కాస్త ఎక్కువైనా తక్కువైనా కష్టమేననే విషయం చాలామంది అనుభవంలోకి వచ్చింది కూడా.తెలుగుదనం లేని కథల్లో నుంచి తెలుగు కథలను తీసుకురావడమంటే అమావాస్యలో నుంచి చంద్రుడిని తీసుకురావడం వంటిదే. తెలుగు కథల పరిమళం తెలియాలంటే ముందుగా వాటిపై ఉన్న ముసుగును తీయాలి అనే విషయాన్ని గ్రహించాలి. మన నుంచే ఇతర భాషలకు కథల ఎగుమతి జరగాలి. అది కదా మనకి గర్వకారణం .. అది కథా గర్వకారణం.

# ఆ విషయం అర్థమైనట్లుంది.. అందుకే కెప్టెన్సీ వదులుకుని మరీ..



"తమ కెరీర్‌లో మేజర్ టైటిల్ గెలవాలని ప్రతి ఆటగాడు కోరుకుంటాడు. కానీ అందరికీ అది సాధ్యం కాదు. ఉదాహరణకు.. సచిన్ టెండుల్కర్ విషయాన్నే తీసుకోండి. కప్ గెలవడానికి తను ఎన్నో వరల్డ్‌కప్ ఈవెంట్లలో ఆడాడు. కొన్నిసార్లు మనం దేనినైతే సాధించాలని తహతహలాడతామో.. అది మనకు సాధ్యం కాకపోవచ్చు. అదొక గుణపాఠంగా మిగులుతుంది. బహుశా.. విరాట్ ఈ విషయాన్ని అర్థం చేసుకున్నట్లు అనిపిస్తోంది" అని టీమిండియా మాజీ వికెట్ కీపర్ సబా కరీం అన్నాడు. ఐపీఎల్-2021 సీజన్ తర్వాత ఆర్సీబీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు విరాట్ కోహ్లి ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశాడు. కాగా 2013 నుంచి బెంగళూరు జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న కోహ్లి.. ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదన్న సంగతి తెలిసిందే. 2016లో ఫైనల్ చేరినా సన్‌రైజర్స్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇక ఈ సీజన్ తొలి అంచెలో మంచి ప్రదర్శనే కనబరిచినప్పటికీ.. చివరి ఫలితం ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పడం కాస్త కష్టం. ఈ నేపథ్యంలో కోహ్లి ప్రకటన క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొంతమంది అతడికి మద్దతు పలుకుతుండగా.. టోర్నీ ముగిసిన తర్వాత ఈ విషయాన్ని వెల్లడిస్తే బాగుండని మరికొందరు విమర్శిస్తున్నారు.ఇక ఈ విషయంపై స్పందించిన సబా కరీం ఖేల్‌నీతి అనే యూట్యూబ్ చానెల్‌తో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. "టైటిల్ గెలవాలని కోహ్లి కోరుకున్నాడు. కానీ అది జరుగలేదు. అయితే, కెప్టెన్‌గా కాకుండా బ్యాట్స్‌మెన్‌గా తన సేవలు జట్టుకు ఎక్కువ అవసరమని భావించి ఉండవచ్చు. కనీసం అలాగైనా ట్రోఫీ అందించాలని భావిస్తున్నాడేమో. ఈ నిర్ణయం ప్రకటించే ముందు తను బాగా ఆలోచించుకుని ఉంటాడు.టీమిండియాకు అన్ని ఫార్మాట్లలో, ఐపీఎల్‌లో ఆర్సీబీకి కెప్టెన్సీ బ్యాటింగ్‌పై ప్రభావం చూపిందనే విషయం అర్థం చేసుకున్నాడు. బ్యాట్‌ను ఝులిపించాలని భావిస్తున్నట్లు ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తన కెరీర్‌ను మరింత కాలం పాటు పదిలం చేసుకునే క్రమంలో.. ఈ నిర్ణయం తీసుకుని ఉంటాడు" అని అభిప్రాయపడ్డాడు. కాగా టీ20 వరల్డ్‌కప్ తర్వాత టీమిండియా పొట్టి ఫార్మాట్ సారథ్య బాధ్యతల నుంచి వైదొలగుతానని కోహ్లి ప్రకటించిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**